RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 340 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 డిసెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఢిల్లీ వాసులకు కష్టకాలం మొదలైంది. ప్రతి ఏడాది చలికాలంలో ఢిల్లీ వాసులు తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ ఏడాది మరింత ముందుగానే ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. దీపావళి పండుగకు ముందే ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. తాజాగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది చలి తీవ్రత పెరగడం, వాయు వేగం తగ్గడంతో ఢిల్లీ, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాల దహనం వల్ల రాజధాని నగరం ఢిల్లీని పొగ అలిమేస్తోంది. దీంతో రాజధాని ప్రాంత ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.




# మన్మోహన్‌కు భారతరత్న ఇవ్వాలి

## దేశ ఆర్థిక వ్యవస్థకు మన్మోహన్ ఊపిరిలూదారు

## శాసనసభలో నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో తెలంగాణ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఆయన సంతాప తీర్మానం ప్రవేశపెట్టి మాట్లాడారు. మన్మోహన్ సింగ్ దేశానికి విశిష్ట సేవలు అందించారని రేవంత్ గుర్తుచేశారు. కేంద్ర ఆర్థిక శాఖ సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్‌గా పని చేశారని చెప్పారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ ఛైర్మన్‌గా, కేంద్ర ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా దేశానికి సేవలందించారని పేర్కొన్నారు. 1991-96 మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఆయన ఊపిరిలూదారని సీఎం వివరించారు. "మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఎన్నో ఏళ్ల పోరాట ఫలితంగా తెలంగాణ ఏర్పడింది. మన్మోహన్ సింగ్ ఎల్‌పీజీ విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా నిలిపారు. 2004-14 మధ్య ప్రధానిగా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధిహామీ, ఆర్టీఐ, ఎన్‌హెచ్‌ఆర్‌ఎంను ప్రారంభించారు. ఆర్థిక స్థితిగతులు మార్చే నిర్మాణాత్మక సంస్కరణలు ప్రవేశపెట్టారు.

**ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు...** సామాజిక విప్లవ కార్యక్రమమైన ఆధార్‌ను మన్మోహన్ ప్రారంభించారు. సరళీకృత ఆర్థిక విధానాలు తెచ్చి ప్రపంచంతో పోటీపడేలా పునాది వేశారు. ఆయన సేవలు భావితరాలు గుర్తుంచుకోవాలి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని ఈ సభ తీర్మానం చేస్తోంది. ప్రపంచం గర్వించదగ్గ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు. ఆయన నీతి, నిజాయతీ, నిబద్ధత కలిగిన నేత. జీవితాన్ని దేశానికి అంకితం చేసిన గొప్ప వ్యక్తి. ప్రధాని సహా అనేక హోదాల్లో ఉన్నా నిరాడంబరంగా జీవించారు. ఉపాధిహామీ పథకాన్ని అనంతపురం, మహబూబ్‌నగర్ నుంచి ప్రారంభించారు.

**ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం...** 2013లో భూసేకరణ చట్టం తెచ్చి నిరుపేదలకు న్యాయం జరిగేలా చేశారు. 2006లో అటవీ హక్కుల చట్టానికి సవరణలు చేసి ఆదివాసీలను ఆదుకున్నారు. ఐటీ రంగంలో శాసించగలుగుతున్నామంటే మన్మోహన్ విధానాలే కారణం. ఆయన తెలంగాణకు ఆత్మబంధువు. 60 ఏళ్ల తెలంగాణ కలను సాకారం చేసిన నాయకుడు. తెలంగాణ బిల్లులను 2 సభల్లో పాస్ చేయించిన సారథి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు చేస్తాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసింది: భట్టి విక్రమార్క...** మన్మోహన్ సింగ్ సరళీకృత ఆర్థిక విధానాలతో దేశాన్ని బలమైన శక్తిగా నిలిపారని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసమానతలు, సామాజిక పరిస్థితి అర్థం చేసుకుని చట్టాల ద్వారా ప్రజల్లో ధైర్యం నింపారన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చారని చెప్పారు. పాలనాపరమైన అంశాలను సామాన్యుడూ తెలుసుకునేలా 2005లో ఆర్టీఐ తెచ్చారని గుర్తుచేశారు.

ఆయన తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకం దేశ గతినే మార్చేసిందని పేర్కొన్నారు. మానవతా ప్రమాణాలు నెలకొల్పిన గొప్ప వ్యక్తి మన్మోహన్ సింగ్ అని భట్టి విక్రమార్క చెప్పారు.

# అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే మాట!



## రేవంత్ మాటను నెగ్గించిన కేటీఆర్!!

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం మంగళవారం (డిసెంబర్ 30) జరిగింది. మాజీ ప్రధానమంత్రి, దివంగత మన్మోహన్ సింగ్ కు సంతాప తీర్మానాన్ని ఆమోదించడానికి తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అసెంబ్లీ వేదికగా ఒక వింత చోటు చేసుకుంది. సభలోనూ బయటా కూడా ఉప్పూ నిప్పులా ఉంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ ను అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ఒకే మాట చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ కు మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత కేటీఆర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలంటూ రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తన ప్రసంగంలో కేటీఆర్ చెప్పారు. కాగా సభలో మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానాన్ని ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో తెలంగాణలో మన్మోహన్ సింగ్ విగ్రహం ఉండాలని.. మంచి ప్రదేశంలో ఆయన విగ్రహం పెడతామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మన్మోహన్ సింగ్ దేశాన్ని కష్టకాలంలో ముందుకు నడిపించిన తీరును ముఖ్యమంత్రి రేవంత్ ప్రశంసించారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ఏర్పాటు జరిగిందని గుర్తు చేసిన ఆయన రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ కృషిని విస్మరించలేమన్నారు. ఉపాధి హామీ, ఆర్టీఐ, ఆధార్ లాంటి చట్టాలు తెచ్చిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిది అని కొనియాడారు. సరళీకృత విధానాలతో భారత్ ప్రపంచంతో పోటీ పడేలా చేశారని.. దేశానికి విశిష్టమైన సేవలు అందించారన్నారు.

ఈ తరంలో మన్మోహన్ సింగ్‌తో పోటీపడేవారే లేరని రేవంత్ పేర్కొన్నారు. అనంతరం ఈ తీర్మానానికి మద్దతు ఇస్తూ మాట్లాడిన కేటీఆర్.. మన్మోహన్ సింగ్ కు భారత రత్న ఇవ్వాలన్న రేవంత్ ప్రకటనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. భారతరత్న పురస్కారానికి మన్మోహన్ పూర్తిగా అర్హులనీ, ప్రధానిగా మన్మోహన్ సింగ్ ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందనీ చెప్పారు.



## మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

హైదరాబాద్ – ప్రస్తుతం హైదరాబాద్ లో ఉన్న మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి స్వయంగా సత్య ఇంటికి వెళ్లారు. ఆయనతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కూడా వెళ్లారు.. హైదరాబాద్ లో ఏర్పాటు చేయనున్న స్కిల్డ్ వర్శిటీపై ఆయనతో రేవంత్ చర్చలు జరిపారు.. ఈ వర్శిటీ ఏర్పాటు అవశ్యకతను సిఈవోకి వివరించారు.. అలాగే ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్ విభాగాలను హైదరాబాద్ లోనే ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అతి పెద్ద రెండో క్యాంపస్ ను హైదరాబాద్ లోనే ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఐటి అభివృద్ధికి తమ సర్కార్ గణనీయంగా ప్రోత్సాహలు ఇస్తున్నదని రేవంత్ చెప్పారు.. ఈ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికంగా హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టాలని కోరారు . దీనికి సత్య నాదేండ్ల సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# 2024

# బీఆర్ఎస్‌కి కలిసి రాని కాలం

## ఫాంహౌస్‌లో కేసీఆర్, జైలుకు కవిత, కాంగ్రెస్లోకి ఎమ్మెల్యేలు!









హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి ఈ 2024 ఏడాది తీవ్ర నిరాశను మిగిల్చిందనే చెప్పుకోవచ్చు. ఊహించని అనేక ఎదురు దెబ్బలను ఆ పార్టీ ఎదుర్కొంది.

**బయటకు రాని కేసీఆర్:** కేసీఆర్ ఈ ఏడాది పెద్దగా బయటకు రాలేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాత్రం ఆయన ప్రచారం చేశారు. ఆ తర్వాత మళ్లీ సైలెంట్ అయ్యి ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారు. బిడ్డ కవిత అరెస్ట్ అయిన సందర్భంలోనూ ఆయన బయటకు రాకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇది వ్యూహాత్మక మౌనమని బీఆర్ఎస్ చెబుతుంటే.. కేసీఆర్ పని ఖతమని కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెబుతున్నారు. ఈ ఏడాది అయినా కేసీఆర్ బయటకు వస్తారా? ప్రజా క్షేత్రంలో మళ్లీ యాక్టీవ్ అవుతారా? అన్న అంశంపై తెలంగాణ పాలిటిక్స్ లో ఉత్కంఠ నెలకొంది.

**కవిత అరెస్ట్..** అసలే ఓటమితో పాటు కేసీఆర్ అనారోగ్యంతో పుట్టెడు కష్టాల్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి కవిత అరెస్ట్ బిగ్ షాక్ ఇచ్చింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో ఎమ్మెల్సీ కవితను మార్చి 12న ఈడీ అరెస్ట్ చేసింది. దాదాపు 165 రోజులు ఆమె జైలు జీవితం గడిపి బెయిల్ పై ఆగస్టు 27న విడుదలయ్యారు.

**ఎంపీ ఎన్నికల్లో దారుణ పరాజయం:** అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఎలక్షన్స్ సైతం బీఆర్ఎస్ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చాయి. ఈ ఎన్నికల్లో పార్టీకి ఒక్కటంటే ఒక్క సీటు కూడా దక్కలేదు. పార్టీ స్థాపించిన నాటి నుంచి తొలిసారిగా ఆ పార్టీ లోక్ సభలో ప్రాతినిధ్యం కోల్పోయింది.

**ఎమ్మెల్యేలు జంప్:** రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ బీఆర్ఎస్ పార్టీని తీవ్రంగా దెబ్బకొట్టింది. కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, కాలె యాదయ్య, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, డా.సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి, దానం నాగేందర్ తదితరులు బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ ఇచ్చి కాంగ్రెస్ లో చేరిపోయారు. వీరితో పాటు ఆరుగురు ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, భాను ప్రసాద్, దండె విఠల్, యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్, ఎంఎస్ ప్రభాకర్ తదితరులు కాంగ్రెస్ గూటికి చేరిపోయారు.

**వరుస కేసులు:** రేవంత్ సర్కార్ గత బీఆర్ఎస్ సర్కార్ హయంలో జరిగిన వివిధ కార్యక్రమాలపై కమిషన్లు వేస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కాళేశ్వరం, పవర్ కమిషన్ల విచారణ కొనసాగుతోంది. వచ్చే నెలలో కేసీఆర్, హరీశ్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉందన్న ప్రచారం సాగుతోంది. ఇదే జరిగితే బీఆర్ఎస్ పార్టీకి బిగ్ షాక్ తగిలే అవకాశం ఉందన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

**ఫార్ములా-ఈ రేసులో కేటీఆర్:** గత ఎన్నికల్లో పార్టీ ఓటమి నాటి నుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నీ తానై పార్టీని నడిపిస్తున్నారు. అయితే.. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో ఏసీబీ ఆయనను A1గా నమోదు చేసింది. అయితే ఈ కేసును క్వాష్ చేయాలని ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

దీంతో ఈ నెల 31వరకు ఆయనను అరెస్ట్ చేయవద్దని ఆశ్రయించింది. కేటీఆర్ అరెస్ట్ అయితే బీఆర్ఎస్ పార్టీలో నాయకత్వ సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందన్న చర్చ పొలిటికల్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

# సంపాదకీయం

## పీవీ...ప్రణబ్ విషయంలో కాంగ్రెస్ తప్పు చేసిందా ?

కాంగ్రెస్ పార్టీ ఈ రోజున కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం మీద విమర్శలు చేస్తోంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కి దక్కాల్సిన గౌరవం దక్కలేదని అంటోంది. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు విషయంలో బీజేపీ ప్రభుత్వం ఆయనను అవమానించిందని, అంత్యక్రియలను అధికారిక స్మశాన వాటికలో కాకుండా నిగంబోధ్ ఘాట్ వద్ద జరిపిందని కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అయితే దీని మీద బీజేపీ కూడా ఘాటుగానే రియాక్ట్ అయింది. మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం కోసం కేంద్ర ప్రభుత్వం స్థలాన్ని కేటాయిస్తుందని, ఇది మాజీ ప్రధానులందరికీ నిబంధనల ప్రకారమే జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. మన్మోహన్ సింగ్ మరణాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. అదే సమయంలో కిషన్ రెడ్డి మరిన్ని విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ, గాంధీ కుటుంబానికి చెందని ప్రధానులు పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ అలాగే, కాంగ్రెస్ అగ్రనేత ప్రణబ్ ముఖర్జీ వంటి వారిని తన వైఖరితో నిరంతరం మోసం చేస్తూ వచ్చిందని అన్నారు. అలాగే వారిని తీవ్ర అవమానాలకు గురి చేసిందని ఆరోపించారు. ఈ విషయం చరిత్రే చెబుతోందన్నారు. మన్మోహన్ మరణానికి కాంగ్రెస్ సంతాపం తెలియజేసినప్పటికీ ఆ పార్టీ ఆయనకు చేసిన అవమానాలను మనం విస్మరించకూడదన్నారు. కిషన్ రెడ్డి మాత్రమే కాదు మాజీ రాష్ట్రపతి దివంగతులైన ప్రణభ్ ముఖర్జీ విషయంలో కూడా కాంగ్రెస్ అవమానించిందని ఏకంగా ఆయన కుమార్తె శర్మిష్ట ముఖరీ ఆరోపించారు. తన తండ్రి ప్రణబ్ ముఖర్జీ చనిపోయినప్పుడు ఆయనకు నివాళులు అర్పించేందుకు కనీసం సీడబ్ల్యూసీ సమావేశం కూడా నిర్వహించలేదని ప్రణబ్ కూతురు శర్మిష్ఠ ముఖర్జీ కాంగ్రెస్ పార్టీ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ రాష్ట్రపతి, తన తండ్రి ప్రణబ్ 2020లో మృతి చెందారని, సీడబ్ల్యూసీ సమావేశం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ విషయంలో కాంగ్రెస్ తనను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. రాష్ట్రపతులకు ఆ సంప్రదాయం పాటించడం లేదని కాంగ్రెస్ పార్టీలోని ఓ సీనియర్ నేత తనను నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. అయితే తన తండ్రి డైరీని చదివిన తర్వాత అది నిజం కాదని తెలిసిందన్నారు. కేఆర్ నారాయణన్‌కు నివాళులర్పించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించినట్లు డైరీలో ఉందన్నారు. ఈ రెండు విషయాలతో పాటు మరొకటి కూడా ఉంది. అదే పీవీ నరసింహారావు వ్యవహారం. ఆయన కాంగ్రెస్ పార్టీని నిలబెట్టారు. 1991 నుంచి 1996 వరకూ అయిదేళ్ల పాటు ఒక మైనారిటీ ప్రభుత్వానికి సారధ్యం వహించి బ్రహ్మాండంగా నడిపారు. ఉత్తమ ప్రధానిగా చరిత్రలో పీవీ నిలిచారు. మరి ఆయన 2004 డిసెంబర్ లో మరణించినపుడు కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ ప్రభుత్వం పీవీని అవమానించింది అని అంటారు. ఆయన పార్థివ దేహాన్ని హైదరాబాద్ కి తీసుకుని రావాల్సి రావడం వెనక ఏమి జరిరిగింది అన్నది కాంగ్రెస్ పెద్దలకే తెలుసు అంటారు. ఈ రోజున ఢిల్లీలో మాజీ ప్రధానులు అందరికీ ఘనంగా అంత్యక్రియలు జరిపి స్మారక చిహ్నాలు ఏర్పాటు చేస్తున్నారు. మరి ఆ గౌరవం పీవీకి ఎందుకు దక్కలేదు అన్న ప్రశ్నలు ఉండనే ఉన్నాయి. పీవీని కాంగ్రెస్ మాజీ ప్రధాని అయ్యాక వదిలించేసుకుందని కూడా అప్పట్లో ప్రచారం సాగింది. ఏ కాంగ్రెస్ కోసం అయితే ఆయన జీవితాంతం శ్రమించారో అదే కాంగ్రెస్ లో ఇందిరాగాంధీ వారసులు ఆయనను అవమానించారు అని అంటారు. ఇక ప్రణబ్ ముఖరీ విషయానికి వస్తే ఆయన కాంగ్రెస్ లో అత్యంత సీనియర్ 1984లోనే ప్రధాని కావాల్సిన వారు కానీ రాజీవ్ గాంధీ ప్రధాని అయ్యారు. ఆ తరువాత 2004లో ఆయనకు చాన్స్ కచ్చితంగా రావాల్సి ఉంది. కానీ అది జరగలేదు. ఇక రాష్ట్రపతి పదవికి కూడా ఆయన పేరుని ముందుగా విపక్షాల నుంచి ఆమోద ముద్ర లభించింది. కానీ చివరికి కాంగ్రెస్ ఆయన పేరుని ఆమోదించింది అని అంటారు. ప్రణబ్ ముఖరీకి కాంగ్రెస్ అవమానం చేసింది అని స్వయంగా ఆయన కుమార్తె ఆరోపించిన నేపథ్యం ఉంది. మన్మోహన్ సింగ్ విషయంలో కూడా స్కాముల మరకలు ఆయన పాలనలో అంటడం వెనక ఎవరు ఉన్నారు అన్నది కూడా చరిత్రలో పదిలంగా ఉందని అంటున్నారు. ఆయన ప్రభుత్వం జారీ చేసిన ఒక ఆర్డినెన్స్ ని మీడియా ముందే నాటి యువ నేత రాహుల్ గాంధీ చించేసి అవమానించారు అన్నది కూడా గుర్తు చేస్తున్నారు. ఏది ఏమైనా పోయినోళ్ళు అందరూ మంచోళ్ళు అన్న మాట ఉంది. అలా వెళ్ళిపోయిన వారిని ఎవరూ అవమానించలేరు. అలా చేశామని అనుకుంటే అది వారి మూర?త్వమే అవుతుంది. అంతే కాదు వారి ప్రతిష్టను తగ్గించాలని చూసినా అది జరిగే పని కాదనే అంటున్నారు.

## ఇతరులకు ఇబ్బందులు వాటిల్లకుండా న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలి : శామీర్పేట సీఐ శ్రీనాథ్

### ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది...








శామీర్ పేట, (గరుడ వార్త) : ఇతరులకు ఇబ్బందులు వాటిల్లకుండా న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా ఆనందంగా నిర్వహించుకోవాలని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ సూచించారు. సోమవారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రిసార్ట్స్, ఫామ్ హౌస్ ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించి వేడుకలు జరుపుకోవాలన్నారు. వేడుకల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో పటిష్ట పోలీస్ బందోబస్త్ తో పెట్రోలింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునే వారు జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు పెద్దలు అందరూ వారి వారి ఇళ్లలో వేడుకలు జరుపుకోవాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**పోలీసుల సూచనలు, నిబంధనలు....**

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసుకునే కార్యక్రమాలు రాత్రి 12:30 గంటల వరకు పూర్తి చేసుకోవాలన్నారు. తర్వాత కొనసాగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలని, మైనర్స్ కు వాహనాలు ఇవ్వవద్దని, టపాసులు, డీజే లు నిషేధమని చెప్పారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమని, వాహనాలు వేగంగా నడపవద్దని సూచించారు. రహదారులు బ్లాక్ చేసి వేడుకలు నిర్వహించరాదని సూచించారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించవద్దని, ఇల్లు, ప్రవేట్ ఆస్తులపై, వీధి దీపాల పై రాళ్లు వేయడం, అద్దాలను పగలగొట్టడం నేరమని తెలిపారు. ర్యాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్ లను తీసివేసి వాహనాలు నడపడం, శబ్ద కాలుష్యం చేస్తూ ఇతరులను ఇబ్బంది పెడితే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యూ ఇయర్ వేడుకలలో నిషేదిత డ్రగ్స్, గాంజా వంటి మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం దుకాణాలను నిర్ణీత సమయంలో మూసివేయాలని, మైనర్లకు మద్యం అమ్మకూడదని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ స్థలాల్లో మద్యం సేవిస్తే కేసులు తప్పవన్నారు. ఈ నూతన సంవత్సర వేడుకుల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమా లైన నిర్వహకులు తప్పని సరిగా పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని తెలిపారు. న్యూ ఇయర్ అఫర్ ల పేరిట సైబర్ నేరగాళ్లు ఆర్థిక నష్టం కలిగించే అవకాశం ఉన్నదని, ఆన్లైన్ నందు, అపరిచితులతో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ అకౌంట్ వివరాలు, పిన్ నెంబర్స్ ఇవ్వరాదని చెప్పారు. ప్రత్యేకపోలీసు బృందాలతో రిసార్టులు, ఫామ్ హౌస్ లు తనికి చేస్తున్నామని తెలిపారు. అంక్షలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు రిసార్ట్స్ లను పరిశీలించి సూచనలు చేశారు. అత్యవసర సమయంలో స్థానిక పోలీసు అధికారులకు, డయల్ 100 కు ఫోన్ చేసి పోలీసు సేవలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి ఐ గంగాధర్, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## అరకొర వసతులు.. అన్నదాత అవస్థలు



కోనరావుపేట : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల ప్రారంభానికి ముందు ధాన్యం రాశులుగా పోయడానికి వీలుగా పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి చదును చేయాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో కేంద్రాల్లో నెలకొన్న సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 1.70 లక్షల పైగా ఎకరాల్లో వరిసాగు చేశారు. 3 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 25 వేల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ 8, మెప్మా 4 మొత్తం 258 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తేమశాతం 17 ఉండాలి. క్వింటాల్‌కు ఏ గ్రేడ్ రకానికి రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300, సన్నరకానికి మద్దతు ధరతో పాటు రూ.500 అదనంగా బోనస్ ప్రభుత్వం ప్రకటించింది.

ఇవి కల్పించాలి...

రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వ నిబంధనల మేరకు శుభ్రం చేయడానికి కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. కేంద్రాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా తొలగించి చదును చేయించాలి. అకాల వర్షం, తేమశాతం బారిన పడకుండా కాపాడుకోవటానికి సరిప డా టార్పాలిన్లను ప్రభుత్వం సమకూర్చాలి. ధాన్యం శుద్ధి చేయటానికి ప్యాడీ క్లీనర్, తేమశాతం సరిచూసే పరికరాలు అందుబాటులో ఉంచాలి. శుద్ధజలంతోపాటు సేదదీరడానికి పూరి గుడిసెలు ఏర్పాటు చేయాలి. విద్యుత్తు దీపాలు లేక అంధకారం నెలకొంది. రాత్రి వేళ వాచ్‌మెన్ అందుబాటులో లేక ధాన్యం దొంగతనానికి గురయ్యే ప్రమాదం ఉంది.

పది రోజులు అయింది

నేను వానాకాలంలో 8 ఎకరాల్లో వరి సాగు చేశాను. పది రోజుల క్రితం 3 ఎకరాల్లోని ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో పోశాను. సేకరణ ప్రారంభిస్తే తేమశాతం వచ్చిన ధాన్యం తూకం వేయడానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు కేంద్రాలు ప్రారంభించకపోవటంతో మధ్యదళారులు, మిల్లర్లకు రూ.1900 నుంచి రూ.2000 విక్రయిస్తున్నారు. మెరుగైన వసతులు కల్పించి తూకాల్లో జాప్యం లేకుండా చూడాలి.

ఎర్ర దేవయ్య, రైతు, ధర్మారం

రెండు మండలాల్లో ప్రారంభంజిల్లాలో ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి బుధవారం ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించేలా చూడాలని పీఏసీఎస్ సీఈవోలకు ఆదేశాలు జారీ చేశాం. రైతులు నిబంధనల మేరకు ధాన్యం తీసుకురావాలి. కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ డీసీవో

## రాయితీ ఇచ్చేద్దాం.. తుక్కుగా మార్చేద్దాం..

హైదరాబాద్: 15 ఏళ్లు దాటిన వాహనాలను తుక్కుగా మార్చాలనే కేంద్రం నిర్ణయానికి అనుగుణంగా గ్రేటర్ చుట్టూ మూడు ప్రాంతాల్లో తుక్కు కేంద్రాల ఏర్పాటుకు రవాణాశాఖ చర్యలు చేపడుతోంది. శంషాబాద్ నందిగామ, వర్గల్, తూప్రాన్‌లో వీటి ఏర్పాటుకు ప్రాథమికంగా పరిశీలన చేసింది. ఇప్పటికే ఓ ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీతో పాటు మరో రెండు కంపెనీలు రిజిస్టర్ వెహికల్ తుక్కు కేంద్రాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.

గ్రేటర్ వ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వాహనాలు 18 లక్షలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలను ఫిట్‌నెస్ చేసిన తర్వాత హరిత పన్ను చెల్లించి, మరో అయిదేళ్లు నడుపుకోవచ్చు.

తుక్కు పాలసీ కింద.. ఈ వాహనాలను తుక్కుగా మార్చాలి. ఇది నిర్బంధం కాకపోవడంతో ఎంతమంది స్వచ్ఛందంగా ముందుకొస్తారనేది అనుమానమే.

స్వచ్ఛందంగా ముందుకొచ్చి.. తుక్కు కింద మార్చితే.. కొత్త వాహనాలు కొనుగోలు సందర్భంగా రాయితీలు ఇవ్వనున్నారు. తుక్కుకు ఖరీదు కట్టి, అందులో కొంతమేర యజమానులకు చెల్లిస్తారు.

వింటేజ్ వాహనాలపై రాని స్పష్టత..

తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలు ఏం చేస్తారనేది దానిపై ఎక్కువ మంది ఆరా తీస్తున్నారు. నగరంలో 15 ఏళ్లు, అంతకంటే ఎక్కువ ఏళ్లు దాటిన కార్లు, ఇతర వాహనాలు ఉన్నాయి. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిగా చాలామంది వీటిని జాగ్రత్తగా కాపాడుకుంటున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా 50 వేల వరకు ఇలాంటి వాహనాలు ఉన్నట్లు అంచనా. తుక్కు పాలసీ నేపథ్యంలో వింటేజ్ వాహనాలపై ప్రత్యేక నిర్ణయం తీసుకుంటారా? లేదా అనే విషయంలో స్పష్టత లేదు. గ్రీన్ ట్యాక్స్ చెల్లించి కొందరు ఈ వాహనాలను వినియోగిస్తున్నారు. మరికొందరు అసలు బయటకే తీయడం లేదు. త్వరలో వింటేజ్ వాహనాలకు సంబంధించి విధివిధానాలపై స్పష్టత వస్తుందని ఓ అధికారి తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు

శామీర్ పేట, (గరుడ వార్త) : శివనామ స్మరణతో ఘనంగా మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాల యం) ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్





శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యుల భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

## భూబ్యాంకులో భద్రం

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) మహా భూ బ్యాంకు సిద్ధం చేసింది. ఇప్పటివరకు వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతోపాటు పలు సంస్థలకు కేటాయింపులు, లేఅవుట్లకు పోను ఇంకా 5,364 ఎకరాల వరకు ఉంది. ఇటీవల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతుండటంతో అసలు లెక్కలు బయటకు తీసింది. ఏడు జిల్లాల పరిధిలో ఎంత భూమి ఉందో సరిచూసింది. దీంతో రూ.వేల కోట్ల విలువైన భూములు హెచ్ఎండీఏ ఖాతాలో ఉన్నట్లు తేలింది. ఈ బ్యాంకులోని భూములను కాపాడుకునేందుకు హెచ్ఎండీ కసరత్తు చేయడంతోపాటు భవిష్యత్తులో వీటిని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు వాడుకునే వెసులుబాటు ఉంది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భూములు అధిక ధర పలుకుతుండటంతో ఆక్రమణలు యథేచ్ఛగా జరుగుతున్నాయి.

భవిష్యత్తు అవసరాలకు...

మహానగరం విస్తరిస్తోంది. ఇప్పటికే గ్రేటర్ దాటి అవుటర్ రింగ్ రోడ్డు వరకు నిర్మాణాలు వెలుస్తున్నాయి. రీజనల్ రింగ్ రోడ్డు తర్వాత మహానగర పరిధి దాదాపు 8 వేల చదరపు కిలోమీటర్ల వైశాల్యం పెరగనుంది. అప్పటి అవసరాలకు అనుగుణంగా వివిధ ప్రాజెక్టులకు భూమి చాలా కీలకం. ప్రైవేటు వ్యక్తుల నుంచి సేకరించాలంటే ప్రభుత్వ ఖజానాపై భారం పడక తప్పదు. దీంతో హెచ్ఎండీఏ భూ బ్యాంకు కాపాడుకుంటే భవిష్యత్తులో చేపట్టబోయే ప్రాజెక్టులకు వెదుక్కోవాల్సిన అవసరం ఉండదు. అయితే భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఆక్రమణదారుల నుంచి కాపాడుకోవడం హెచ్ఎండీఏకు పెద్ద సవాలుగా మారుతోంది. తొలుత చిన్న చిన్న గుడిసెలు వేసి...వాటికి దొంగ సర్వే నెంబర్లు సృష్టిస్తున్నారు. నెమ్మదిగా పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారు. వాటిని కూల్చడానికి వెళితే కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకొస్తున్నారు. ఈ భూముల రక్షణ కోసం హెచ్ఎండీఏ పకడ్బందీగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీపీఎస్‌తో అనుసంధానం..

శేరిలింగంపల్లిలోని మియాపూర్‌లోని సర్వే నంబరు 100, 101లో హెచ్ఎండీఏకు 445.340 ఎకరాలు ఉండగా.. ఇటీవల ఇందులో పెద్దఎత్తున ఆక్రమణలకు పాల్పడ్డారు. కొందరు నేతలు ప్రోద్బలంతో గుడిసెలు వేయగా...అధికారులు అతికష్టం మీద అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ భూమి చుట్టూ హెచ్ఎండీఏ కంచె నిర్మిస్తోంది. జీపీఎస్‌తోనూ అనుసంధానం చేయనున్నారు. భవిష్యత్తులో ఎవరైనా సర్వే రాళ్లు తొలగించి హెచ్ఎండీఏ భూమిలోకి చొచ్చుకొచ్చినా జీపీఎస్ కోఆర్డినేట్స్ చూసి తొలగించే అవకాశం ఉంది.

కాప్రా మండలం జవహర్‌నగర్‌లోని వివిధ సర్వే నంబర్లలో 2370 ఎకరాలు ఉండగా...ఇందులో ఇప్పటికే వివిధ అవసరాల కోసం 795 ఎకరాలు కేటాయించారు. ఇంకా 1574.300 ఎకరాలు హెచ్ఎండీఏ ఖాతాలో ఉంది. ఈ భూమికి సరైన రక్షణ లేక ఆక్రమణల పాలవుతోంది. దాదాపు ఆరేడు వందల ఎకరాలకు సంబంధించి కోర్టు కేసులు నడుస్తున్నాయి. చాలాచోట్ల ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

## బిల్డర్ల నుంచే బాధితులకు పరిహారం..?

బాచుపల్లిలో చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లోనే ఓ బడా నిర్మాణ సంస్థ రెండు టవర్లను కట్టింది. సుమారు వెయ్యి మంది ఒక్కో ఫ్లాట్‌ను రూ.80లక్షల నుంచి రూ.కోటిన్నరకు కొనుగోలు చేశారు. ఈ ఫ్లాట్లను హైడ్రా కూల్చేస్తే అందులో ఉంటున్న వారంతా రోడ్డున పడే అవకాశం ఉంది. మూసాపేటలోనూ ఓ చెరువు ఎఫ్‌టీఎల్‌ను మార్చేసి ఓ నిర్మాణ సంస్థ అపార్టుమెంట్ల నిర్మాణాన్ని దాదాపు పూర్తి చేసింది. నగరంలో అక్రమ నిర్మాణాలు భారీగానే ఉన్నాయి. ఇందులో కొన్నింటికి తప్పుడు పత్రాలతో అనుమతులు పొందారు. నిబంధనల ప్రకారం వీటిని హైడ్రా కూల్చివేయాల్సిందే. ఒకవేళ ఇదే చేస్తే ఎన్నో ఏళ్ల కిందట వాటిని కొనుగోలు చేసిన సామాన్యులు రోడ్డునపడతారు. ఇలాంటి నిర్మాణాల కూల్చివేతల విషయంలో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుందనే భావనలో హైడ్రా అధికారులున్నారు. వీరికి బిల్డర్ల నుంచి పరిహారం ఇప్పించాలని భావిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల కిందట హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇదే విషయాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వివరించారు. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని మంత్రి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై త్వరలో సర్కార్ విధానపరమైన నిర్ణయం తీసుకోనుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రెండు నెలలు బ్రేక్...

సుమారు 2 వేలకుపైగా కట్టడాలు చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయి. వీటిలో చాలా వాటికి బల్దియా, హెచ్ఎండీఏ, పంచాయతీలు అనుమతులు ఇచ్చాయి. ఈ విషయంలో అధికారులు నిబంధనలను తుంగలోకి తొక్కినట్లు తెలుస్తోంది. కొందరు బిల్డర్లు ఒక సర్వే నంబరులో అనుమతులు తీసుకొని మరో సర్వే నంబరులో ఇళ్లను నిర్మించారు. వీటిని వేలాది మంది కొనుగోలు చేశారు. వీటన్నింటినీ కూల్చితే కొనుగోలు చేసిన వారు తీవ్రంగా నష్టపోతారని, ఇది ప్రభుత్వ వ్యతిరేకతకు దారితీసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. దీనిపై సీనియర్ మంత్రులతో చర్చించి ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని సీఎం నిర్ణయించారని అధికారవర్గాలు చెబుతున్నాయి. బిల్డర్ నుంచి కొనుగోలుదారులకు పరిహారం ఇప్పించాలని యోచిస్తున్నారు. మూసీ విషయంలోనూ దీన్నే అవలంబిస్తారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు నెలలపాటు ఎటువంటి కూల్చివేతలు చేపట్టకూడదని హైడ్రా నిర్ణయించింది.

# ముక్కోటి పనులు ముమ్మరం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈనెల 31 నుంచి జనవరి 20 వరకు నిర్వహించనున్న శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. జనవరి 9న సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి వరకు గోదావరిలో తెప్పోత్సవం ఉంటుంది. ఇందుకు సంబంధించి హంస అలంకారం విడిభాగాలను ఘాట్ వద్ద సిద్ధం చేస్తున్నారు. వీటికి రంగులద్ది లాంచీకి అమర్చిన అనంతరం తెప్ప వాహనం తయారవుతుంది. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు తరలివస్తారన్న అంచనాతో నది తీరంలో ఖాళీ స్థలాలను గుర్తించి చదును చేస్తున్నారు. పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శ్మశాన వాటిక మార్గం గుండా ఘాట్‌కు వెళ్లే దారిలో గతంలో అటవీశాఖ మొక్కలను పెంచగా నిర్వహణ



లోపంతో ఈ మొక్కలు కనుమరుగయ్యాయి. ఖాళీగా ఉంటున్న ఈ స్థలంలో భక్తులకు తాత్కాలిక వసతి సదుపాయాన్ని కల్పించేందుకు మేడారం జాతర తరహాలో కుటీరాలను ఏర్పాటు చేయనున్నారు. జనవరి 10న ఉత్తర ద్వార పూజలకు వచ్చే భక్తులకు తగిన సదుపాయాలు కల్పించేందుకు ఈఓ రమాదేవి చర్యలు చేపట్టారు.

**పర్ణశాల ఆలయం వద్ద చలువ పందిరి ఏర్పాటు**

**పర్ణశాలలో ఏర్పాట్లు ఇలా..**

పర్ణశాలలోని శ్రీసీతారాములవారి ఆలయంలోనూ ముక్కోటి ఏకాదశి మహోత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం, ప్రధాన గోపురం, ప్రహరీ, కుటీరం, విశ్రాంతి మండపాలను రంగులతో తీర్చిదిద్దుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు సాగుతున్నాయి. నీడ కోసం చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి ఊరేగింపునకు గరుడ, రాజాధిరాజ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. ఉత్సవాల వేళ రద్దీకి అనుగుణంగా పులిహోర, లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఆలయానికి విద్యుత్తు దీపాలను అలంకరించే పనులు ఇప్పటికే మొదలయ్యాయి.

# ఇప్పటి ఔషధాల లడ్డూ కావాలా నాయనా..!

ఖమ్మం : మనం ఇప్పటివరకు ఎన్నో రకాల లడ్డూల రుచి చూసి ఉంటాం కానీ ఇప్ప పూలతో తయారుచేసే లడ్డూ రుచే వేరు. నోట్లో పెట్టుకుంటే మధురంగా అనిపిస్తూ కరిగిపోతుంది..! భద్రాచలంలోని ఆదివాసీ 'ఓం శక్తి మల్టీ ప్రొడక్ట్' సంఘంలోని 15 మంది మహిళలు ఇప్ప పూలతో లడ్డూలు తయారుచేస్తున్నారు. ఐరన్, కాల్షియం ఇందులో ఉండటంతో జీర్ణశక్తి మెరుగుపడుతుంది. నెయ్యి, బెల్లం, బాదం, జీడిపప్పును ఇప్ప పూల లడ్డూలో తగుపాళ్లలో కలపటం వల్ల ఇందులో ఔషధ గుణాలు సమృద్ధిగా లభిస్తున్నాయి. ఒక్కో లడ్డూ బరువు 30 గ్రాముల నుంచి 40 గ్రాములు ఉంటుంది. వీటిని ఐటీడీఏ ఆధ్వర్యంలోని స్టాల్‌లో విక్రయిస్తున్నారు. ఐటీడీఏ పీఓ రాహుల్ ప్రోత్సాహంతో



ఇప్ప పూల లడ్డూల తయారీని చిన్న పరిశ్రమలా మార్చాలని యోచిస్తున్నామని నిర్వాహకులు కొండ్రు సుధారాణి, శీలం దుర్గ, కమల, వసుంధర తెలిపారు. ఇప్పటితరాన్ని పట్టిపీడిస్తున్న రక్తహీనత సమస్యకు ఇప్ప పూలు మంచి విరుగుడు అని అశ్వాపురం ఆయుర్వేద వైద్యురాలు డా. గుమ్మడి అరుణ తెలిపారు. ఇప్ప పూలతో తయారయ్యే లడ్డూలో రక్తహీనతను తగ్గించే గుణం ఉంటుందన్నారు. ఇందులో ఐరన్ ఉండటం వల్ల పోషకాహారంగా ఉపయోగపడుతుందని, జీర్ణశక్తిని పెంపొందిస్తుందని వివరించారు.

# అక్రమ కట్టడాలు.. అదనపు అంతస్తులు

అల్వాల్ : గతంలో ఎన్నడూ లేనివిధంగా అల్వాల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. హైడ్రా చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మిస్తున్న వాటిపైనే దృష్టి సారించడం..స్థానిక యంత్రాంగం పట్టింపులేకపోవడంతో.. జనావాసాల నడుమ నిబంధనలకు విరుద్ధంగా గోదాములతో పాటు ఇష్టారాజ్యంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారి కట్టడాలకు ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని.. అదే సామాన్యులు పది శాతం నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ వ్యవహారం సర్కిల్ పరిధిలో వివాదాస్పదమవుతోంది.

**అక్రమ నిర్మాణాలకు ఉదాహరణలివిగో..**

ప్రస్తుతం వెస్ట్ వెంకటాపురం నాలాను ఆనుకొని చేపట్టిన ఓ అక్రమ నిర్మాణం కొనసాగుతోంది.గతంలో ఓల్డ్అల్వాల్‌లో నాలా ఆనుకొని ఓ నిర్మాణం చేపట్టారు. అప్పట్లో ఈ నిర్మాణం నాలావైపు కుంగింది. ఈ భవనాన్ని తొలగిస్తామని అప్పట్లో ప్రకటించారు. అనంతరం ఏం జరిగిందో ఏమో.. అధికారులు పట్టించుకోలేదు. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తి చేసుకొని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారు. లోతుకుంట, సుభాష్‌నగర్ కాలనీల్లో తక్కువ స్థలంలో అదనపు అంతస్తులు చేపడుతున్నారు. వైష్ణవీమాత ఆలయ మార్గంలోను ఇదే పరిస్థితి నెలకొంది.

సామాన్యులవే కూల్చుడు.. పలుకుబడి ఉంటే..

ప్రస్తుతం ప్రధాన రహదారులకు ఇరువైపుల భారీ కట్టడాలు వెలుస్తున్నాయి. అనుమతులు లేకున్నా సెల్లార్లు, అదనంగా అంతస్తులు నిర్మిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో 100, 200 గజాల స్థలాల్లోనే ఐదు, ఆరు అంతస్తులు నిర్మిస్తున్నారు. వీటితో సర్కిల్ ప్రణాళిక దెబ్బతింటోంది. అనధికారికంగా నిర్మించడంతో జీహెచ్ఎంసీ ఆదాయమూ కోల్పోతోంది. కొన్ని సందర్భాల్లో ఆయా కట్టడాలన్నింటికి తాఖీదులిస్తున్నా.. కూల్చివేతలను మాత్రం సామాన్యులకు పరిమితం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. రాజకీయ నేతల మద్దతు, పలుకుబడి ఉన్న నిర్మాణాలపై తప్పనిసరి పరిస్థితి వస్తేనే నామమాత్రంగా ప్రహరీలు, కొద్దిగా ముందు భాగం కూల్చుతున్నారు. కూల్చివేసిన కట్టడాలను సంబంధితులు వారంలోనే పూర్తిచేసి యంత్రాంగానికి పరోక్షంగా సవాల్ విసురుతున్నారు. అక్రమ నిర్మాణాలపై అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. ఇప్పటికే కొన్ని భవనాలను సీజ్ చేయడానికి నిర్ణయించామని, త్వరలోనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఈ సారైనా.. 'ఆశలు' పట్టాలెక్కేనా..?



కొత్తగూడెం: కొత్తగూడెం- కొవ్వూరు(ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా) రైల్వేలైన్ నిర్మాణ అంశం ఇటీవల మరోసారి తెరపైకి వచ్చింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. 1964లో ఈ లైన్ నిర్మాణానికి బీజం పడగా.. ఇప్పటివరకు 60ఏళ్లకు పైగా కేవలం ప్రకటనలకే పరిమితమైంది. స్థానిక ఎంపీలు అప్పుడప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించినప్పుడు మాత్రమే కదలిక వచ్చినా అధికారులు సర్వేలతోనే సరిపెట్టేవారు. తాజాగా జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొవ్వూరు రైల్వేలైన్‌పై స్పష్టతనిచ్చారు. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు రూ.2,115 కోట్లతో ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తిచేస్తామని లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో..**

భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం)-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా కొత్తగూడెం కేంద్రంగా 1984లో కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఏర్పాటైంది. కొదమసింహ పాండురంగాచార్యులు అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీ ఆధ్వర్యంలో రైల్‌రోకో వంటి వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభించటంతో కమిటీని సత్తుపల్లి, చంద్రుగొండ, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, వీఎంబంజర వంటి ప్రాంతాలకు విస్తరించారు. 2014 జనవరి 18 నుంచి 22 రోజుల పాటు కొత్తగూడెం నుంచి కొవ్వూరు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఇందులో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అప్పటి నుంచి ఏదో ఒకరకంగా రైల్వేలైన్ సాధన కోసం ఈ కమిటీ ప్రయత్నిస్తూనే ఉంది.

**150 కి.మీ. దూరం, 2.30 గంటల సమయం ఆదా..**

కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ ఏర్పాటుతో హైదరాబాద్- విశాఖపట్నం మధ్య 150కి.మీ. దూరం తగ్గటంతో పాటు 2.30 గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం హైదారాబాద్ నుంచి విశాఖకు విజయవాడ మీదుగా వెళ్తే 800కి.మీ. ప్రయాణించాలి. అదే కొత్తగూడెం- కొవ్వూరు లైన్ పూర్తయితే హైదరాబాద్ నుంచి విశాఖకు వయా కొత్తగూడెం అందుబాటులోకి వస్తుంది. అప్పుడు 650కి.మీ. ప్రయాణంతోనే విశాఖకు చేరుకోవచ్చు. సింగరేణి సంస్థ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు 56.25కి.మీ. రైల్వేలైన్ పూర్తయ్యింది. సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మరో 95కి.మీ. లైన్ నిర్మించాల్సి ఉంది.

**ప్రతిసారీ నిరాశే..**

కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి 1964లో ప్రతిపాదనలు రూపొందించి సర్వే చేశారు. కొన్ని కారణాల వల్ల పనులు పట్టాలెక్క లేదు. 2009లో రైల్వేశాఖ సహాయ మంత్రి కేహెచ్ మునియప్ప లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రతిపాదిత బ్రాడ్‌గేజ్ లైన్‌కోసం తుది లోకేషన్ సర్వే పూర్తయిందని చెప్పారు. 2012-13లో మొదటి సారి రూ.1,445కోట్లతో రైల్వేలైన్ మంజూరు చేయగా.. ఆతర్వాత రూ.2,154.83కోట్లకు సవరించినట్లు అప్పటి మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ లోక్‌సభలో పలుమార్లు ప్రస్తావించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వేలైన్ కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించటంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు మంజూరుచేయటం అభినందనీయం. ఈ లైన్ పూర్తయితే తెలంగాణ, ఏపీలోని సుమారు 200 గిరిజన గ్రామాలకు రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది. విశాఖపట్నం, కాకినాడ పోర్టుల నుంచి సికింద్రాబాద్, నాగ్‌పూర్ వైపు సరకుల రవాణాకు ఈ మార్గం ఉపయోగపడుతుంది.
కొదమసింహ పాండురంగాచార్యులు, కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు, కొత్తగూడెం

# సైన్స్ బలోపేతమే లక్ష్యం..



ఖమ్మం : ఫిబ్రవరి 25న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) వారు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హులైన వారి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**ఉప ప్రధాన అంశాలు..**

కృత్రిమ మేధస్సును సైన్స్ బోధనా అంశంగా అమలు పరచటం. పర్యావరణ సమతుల్యత, స్థిరమైన పర్యావరణ వ్యవస్థ నిర్వహణ కోసం వ్యూహాలు. పాఠశాలల్లో విద్యార్థుల శ్రేయస్సు కోసం ఆహార విద్య అమల్లో ఉపాధ్యాయుల పాత్ర. సైన్స్ విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ మార్గాలు. రసాయనశాస్త్రాన్ని నేర్చుకునే ప్రధాన వనరుగా గృహం ఉన్నాయి.

**ఏం చేయాలి..**

రాష్ట్రస్థాయి సెమినార్ కోసం ఆసక్తి గల వారు తమ సెమినార్ పత్రాలను రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ వారు పేర్కొన్న నిర్ణీత నమూనాలో రాసి పంపాలి.

**సెమినార్ ఉద్దేశాలు, లక్ష్యాలు..**

సైన్స్ విద్యావిధానం-బోధనలో అభివృద్ధి చెందుతున్న నూతన ధోరణులను అన్వేషించటం కోసం బోధించటంలో కొత్త పద్ధతులను అమలు చేయడం. వ్యక్తులు, సమాజం యొక్క సమకాలీన అవసరాలకు, సవాళ్లకు అనుగుణంగా సైన్స్ విద్యను బలోపేతం చేయడం. సైన్స్ సంబంధిత శాస్త్రీయ భావనలను వర్తింపజేయటంలో విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయటం వంటి లక్ష్యాలు ఉన్నాయి.

**పేపర్లు దేని ఆధారంగా ఉండాలి..**

చర్యాత్మక పరిశోధన లేదా పరిశోధన ఆధారిత కథనాలు. తరగతి గదిలో అనుసరిస్తున్న బోధనా విధానాలకు సంబంధించినవి, ఇంగ్లిషు, తెలుగు, ఉర్దూ భాషల్లో రాసి పేపర్లను పంపించవచ్చు.

**ఎవరెవరు అర్హులు..**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, విద్యా కళాశాలల అధ్యాపకులు, ఇతర క్షేత్రస్థాయి సైన్స్ సిబ్బంది, విద్యా విధానం కోసం తపన పడుతూ, సైన్స్‌తో అనుబంధం ఉన్న ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసే వారు, జిల్లా స్థాయిలో ఐఏఎస్ఈఎస్, సీటీఈఎస్, డైట్ ప్రిన్సిపల్స్, ప్రైవేటు డీఈఐఈడీ, బీఈడీ కళాశాలల అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, విద్యా పరిశోధకులు సైన్స్ సెమినార్‌కు తమ పత్రాలు సంబంధిత ఈమెయిల్స్ ద్వారా పంపాల్సి ఉంటుంది. పత్రాలు పంపేందుకు తుది గడువు వచ్చే జనవరి 20. వాటిని స్క్రీనింగ్ చేసిన తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులకు సమాచారం అందిస్తారు. ఎంపికైన వారు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తయారు చేసుకుని సెమినార్‌లో పాల్గొని అందరికీ వివరించాల్సి ఉంటుంది.

**గతేడాది..**

గతేడాది రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ అంశం 'శాస్త్రీయ విద్యలో వెలుగొందుతున్న భారతావని' అనే అంశం నుంచి రాష్ట్రస్థాయికి 31 పేపర్లు ఎంపిక కాగా వీటిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు.

# ప్రపంచ దేశాల్లో 'విజయ్' యాత్ర

ఖమ్మం : సెలవులు వచ్చాయంటే చాలామందికి సరదాగా గడపటం అలవాటు. వారాంతంలో, ఎక్కువ సెలవులు వచ్చిన సందర్భంలో సమీపంలోని ప్రాంతాలను చుట్టేస్తుంటారు. కానీ ఓ యువకుడు మాత్రం విదేశాలను తిరగటం అలవాటుగా మార్చుకున్నాడు. ఖమ్మం నగరానికి చెందిన చెరుకూరి విజయ్‌కృష్ణ ఇప్పటివరకు 55 దేశాల్లో పర్యటించారు.

**ఆదా చేస్తూ..**తరచూ వివిధ దేశాల్లో పర్యటించటం ఖర్చుతో కూడుకున్న పనే అయినా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నానని విజయ్‌కృష్ణ చెబుతున్నారు. తక్కువ ఖరీదు కలిగిన టికెట్లను కొనుగోలు చేయటం, స్థానికుల ద్వారా పరిచయాలు పెంచుకుని ఆతిథ్యం స్వీకరిస్తుండటం, తదితర వాటి ద్వారా 50శాతం ఖర్చును ఆదా చేస్తున్నానని తెలిపారు. ప్రతి దేశ పర్యటన సందర్భంగా అక్కడి చారిత్రక ప్రాంతాలు, కొండలు, జలపాతాలను సందర్శించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతానని వివరించారు. 'ప్రపంచ దేశాలన్నీ తిరగటం నా లక్ష్యం. కొత్తకొత్త ప్రాంతాల్లో తిరగటం వల్ల మానసికోల్లాసం కలుగుతుంది. పని ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు వివిధ దేశాలో పర్యటించాలని నిర్ణయించుకున్నా. తద్వారా భిన్న సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం కలిగింది' అని చెరుకూరి విజయ్‌కృష్ణ 'ఈనాడు'కు తెలిపారు.




**సెలవుల్లో సరదాగా ప్రయాణం**

చెరుకూరి విజయ్‌కృష్ణ ప్రస్తుతం స్వీడన్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సెలవులు దొరికినప్పుడు దేశాలను చుట్టేస్తున్నారు. ఇప్పటికే యూరప్ ఖండంలోని దేశాలన్నింటినీ సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో విభిన్న సంస్కృతులను పరిశీలిస్తున్నారు. ప్రతి దేశాన్ని అద్భుతంగా చిత్రీకరించి తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకుంటున్నారు. కొన్ని దేశాల పర్యటన సందర్భంగా భాషాపరమైన ఇబ్బందులు, ఆహార సమస్యలు ఎదురవుతున్నప్పటికీ స్థానికుల సహకారంతో వాటిని అధిగమిస్తున్నారు.

# కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడో!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వ వైఖరి వేలాదిమంది బీడీకార్మికుల పాలిట శాపంగా మారింది. 2014 ఫిబ్రవరి 28 వరకు పీఎఫ్ ఖాతాలో నమోదైనవారికే జీవనభృతి పింఛన్లు అందిస్తున్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ అమల్లోకి రాకపోగా ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారాస రెండుసార్లు అధికారంలో ఉన్నపుడు కటాఫ్ తేదీని ఎత్తివేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఎత్తివేయక అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా పీఎఫ్ ఖాతాకలిగిన ప్రతిఒక్కరూ ఆసరా పింఛన్‌కు దరఖాస్తు చేయాలని గతంలో ప్రభుత్వం సూచించటంతో వేలాదిమంది దరఖాస్తు చేశారు. 18-50 ఏళ్లలోపు వయసువారు 1.5 లక్షల్లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకుఖాతా, రేషన్‌కార్డు, ఈపీఎఫ్ అపాయింట్మెంట్‌లెటర్, ఆన్‌లైన్ స్టేట్మెంటు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో ఎంపీడీవో కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో అందించారు. కానీ వీరికి ఇప్పటికీ పింఛన్ మంజూరు



కాలేదు. పూర్వపు కరీంనగర్ జిల్లాలోని లక్షలాదిమందికి దశాబ్దాలుగా ఉపాధి కల్పించిన బీడీ పరిశ్రమ క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఆసరా ఫించన్ పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్యరీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉండగా సిరిసిల్ల జిల్లా నాలుగోస్థానంలో ఉండటం ఇక్కడివారి అనుబంధ ఉపాధిని వెల్లడిస్తోంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రధాన పట్టణాలు, మండలాలు, పల్లెల్లోనూ బీడీ పరిశ్రమ ఆధారితంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 46 వరకు బీడీ కంపెనీలుండటం ఇక్కడి బీడీ పరిశ్రమ ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. పల్లెలు, పట్టణాలని తేడాలేకుండా చాలామంది బీడీలు చుట్టడాన్ని ఉపాధిగా మలచుకోగా బీడీ తయారీ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రభావం, చవకరకం సిగరెట్ల పోటీతో బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గి ప్రస్తుతం నెలలో తగినన్ని పనిరోజులు లేనందున కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ, బీడీల తయారీకి తగినట్లు తునికాకును సరఫరా, బీడీల తయారీ ధరను పెంచటం, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల రాయితీ ఇవ్వటం, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించి తమ పిల్లలకు ఉపకార వేతనాల మంజూరు, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందించటం, అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపుతోనే తమ మనుగడ సాగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

# అన్నదాత ఇంట.. సిరుల పంట

పెద్దపల్లి : జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో అన్నదాత పంట పండింది. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రచారం సత్ఫలితాలనిచ్చింది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులతో అధికారులు అంచనా వేసిన దాని కంటే ధాన్యం దిగుబడి స్వల్పంగా తగ్గింది. బోనస్ చెల్లింపుతో రైతులకు గిట్టుబాటు కలిగింది. ఈ సీజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం ఊరట కలిగించింది.

**50 వేల ఎకరాలు అధికం**

వానాకాలంలో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. ఇందులో 1.72 లక్షల ఎకరాల్లో సన్న రకం, 36 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు పెరిగింది. ఈ మేరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 90 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రానుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి పైర్లు పొట్ట దశలో ఉన్నపుడు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గింది. జిల్లాలో ఇప్పటివరకు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో 64 వేల టన్నులు, మిల్లర్లు నేరుగా 30 వేల టన్నులు కొనుగోలు చేశారు. సన్న ధాన్యానికి సంబంధించి 2.18 లక్షల టన్నులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించగా మరో 20 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. రైతులు సొంత అవసరాలకు మరో 30 వేల టన్నులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

**కలిసొచ్చిన అధికారుల ప్రచారం**

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో జిల్లాలో సన్న వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. సీజన్ ఆరంభం నుంచే బోనస్ చెల్లింపుపై అధికారులు ప్రచారం చేశారు. ఊహించినట్లుగానే రైతులకు బోనస్ లాభదాయకంగా మారింది. క్వింటాలుకు రూ.500 చెల్లిస్తుండటంతో పెట్టుబడుల భారం తప్పుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 50,523 మంది రైతుల నుంచి రూ.658.74 కోట్ల విలువైన 2.83 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 48,538 మందికి రూ.657.03 కోట్లు చెల్లించారు. 1.98 లక్షల టన్నుల సన్న ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయగా మొత్తం రూ.99 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా రూ.75.59 కోట్లు జమయ్యాయి.

**ఆర్థిక భారం తీరింది**

నాకున్న మూడున్నర ఎకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని సన్న వరి సాగు చేశా. తెగుళ్ల నివారణ చర్యలు తీసుకున్నా. మొత్తం 160 క్వింటాళ్ల దిగుబడి రాగా ప్రభుత్వం నుంచి రూ.80 వేల బోనస్ వచ్చింది. పెట్టుబడి ఖర్చులకు ఆర్థిక భారం తీరింది. -మార్త దేవేందర్, మచ్చుపేట, ముత్తారం మండలం

**రూ.1.35 లక్షల బోనస్** తొమ్మిదెకరాల్లో సన్న వరి వేశా. ఎకరాకు 30 క్వింటాళ్ల చొప్పున 270 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం రూ.1.35 లక్షల బోనస్ వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రైతులకు ప్రోత్సాహకంగా ఉంది. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుండగా బోనస్ చెల్లింపులు మాకెంతో అండగా నిలిచాయి. -గంధం మహేందర్, మల్లాపూర్, ధర్మారం

# క్రయ విక్రయాల తిప్పలు తప్పేదెన్నడో?

జగిత్యాల : జిల్లా కేంద్ర వ్యవసాయ మార్కెట్యార్డు అధిక ఆదాయం కలిగి ఏడాది పొడవునా క్రయవిక్రయాలు సాగిస్తున్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాల కల్పనలో వెనకంజలోనే ఉంది. బీటుబజార్‌లో పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాల్లో గోదాములు, కార్యాలయం, రైతు విశ్రాంతి భవనం, ఏడీఏ కార్యాలయం, భూసార పరీక్షా కేంద్రం, ఈనామ్ భవనం తదితర నిర్మాణాలున్నాయి. మిగిలిన స్థలంలో దినుసుల క్రయవిక్రయాలు చేపట్టేవారు. ఇందులోనుంచి 2 ఎకరాల స్థలాన్ని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెటుకు ఇవ్వటంతో దినుసుల కళ్లానికి స్థలం ఇరుకుగా మారింది. మిగిలున్న కొంత స్థలంలోనే దినుసులను కొంటున్నా మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ దినుసుల యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోటగా పరిస్థితి మారింది.

**అందని నిధులు** చల్‌గల్‌యార్డుకు బీటును పూర్తిగా తరలిద్దామన్నా అక్కడ పూర్తిస్థాయి క్రయవిక్రయాలు జరిపే పరిస్థితుల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి గతంలో తీసుకున్న 21 ఎకరాల్లో 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి కేటాయించారు. దినుసుల బీటుకు ఇచ్చిన 16 ఎకరాల స్థలంలోనే 15 వేల టన్నుల సామర్థ్యంగల 4 భారీ గోదాములను, ఒక రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, ధర్మకాంటా, 4 వేయింగ్‌షెడ్లు తదితర నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన 5 ఎకరాల భూమిలోనూ సిమెంటు గచ్చు లేనందున కందులు, పెసలు, మక్కలు,



నువ్వులు తదితర దినుసులను కుప్పలుగా పోసి విక్రయించటం సాధ్యపడదు. వాలంతరి నుంచి మరో 10 ఎకరాలను తీసుకున్నా ఈ స్థలంకూడా మామిడి మండీకే కేటాయించటంతో దినుసుల బీటుకు 5 ఎకరాల స్థలమే మిగిలింది. ఏడాదిక్రితమే ఈ స్థలంలో రూ. కోటితో గచ్చు, రూ.70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ.5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ.10 లక్షలతో గోదాముల మరమ్మతులు తలపెట్టినా ఇప్పటికీ నిధులు మంజూరుగాక పనులను చేపట్టలేదు. చల్‌గల్‌యార్డు పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది. రైతులు, అడ్తీ ఖరీదుదారులు, మిల్లర్లు, చాట సడెం కూలీలు, దడువాయిలు, హమాలీలు చల్‌గల్‌కు వెళ్లి పొద్దంతా ఉండి క్రయవిక్రయాలు, తూకం చేపట్టాలంటే అనేక ఇబ్బందులుం టాయి. ఈ నేపథ్యంలో చల్‌గల్ యార్డులో రైతు విశ్రాంతి భవనంతో పాటుగా ఇతర భవనాలను నిర్మించాలి.

దినుసుల బీటును చల్‌గల్‌లో నిర్వహిస్తే ప్యాక్స్ ఆధ్వర్యంలోని చల్‌గల్ ధాన్యం సేకరణ కేంద్రానికి మరో స్థలాన్ని సమకూర్చాలి. దీనిపై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ వివరిస్తూ నిధులు వస్తే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి పనులను ప్రారంభిస్తే యాసంగి పంట ఉత్పత్తుల విక్రయ సమయానికి అందుబాటులోకి వస్తుంది.

## చరిత్ర ఘనం.. పరిస్థితి దయనీయం

హైదరాబాద్ : అద్భుతమైన కళా సంపద.. అపురూప శిల్పాలు.. అరుదైన ఈజిప్షియన్ మమ్మీ.. ప్రపంచంలోనే ఘనమైన నాణెలు.. ప్రసిద్ధ జైన, బౌద్ధ శిల్ప సంపద ఉన్న రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల (స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం) నిరాదరణకు గురై సందర్శకులకు దూరమవుతోంది. 94ఏళ్ల చరిత్ర కలిగిన పబ్లిక్‌గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియంలో అరుదైన కళా సంపద పెట్టెలు.. తాళాలు వేసిన గదులకే పరిమితమవుతోంది.

**ఎన్నో ప్రత్యేకతలు**

దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన వారసత్వ భవనంలోని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం ప్రపంచంలోనే విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియం తర్వాత అత్యంత అరుదైన నాణెలు కలిగిన మ్యూజియంగా ప్రసిద్ధిగాంచింది. మన దేశంలో ఉన్న ఆరు ఈజిప్షియన్ మమ్మీల్లో ఒకటి ఇక్కడే ఉంది. అరుదైన మధ్య యుగపు నాటి అబ్దుల్ రహ్మాన్ సోగతాయి పెయింటింగ్స్ ఇక్కడే ఉన్నాయి. గద్వాల సంస్థాన కాలానికి చెందిన కూచిపూడి జడ సహా మధ్యయుగానికి సంబంధించిన అనేక నగలు ఉన్నాయి. శిలాయుగం నుంచి మధ్యయుగం దాకా జనజీవనంలో అన్ని అంశాలను స్పృశించే వస్తువులు ఉండటం విశేషం. కంచు విగ్రహాలు, బౌద్ధశిల్పాలు, బావికొండలో దొరికిన బుద్ధుని అస్తికలు.. కుతుబ్‌షాహీల కాలానికి సంబంధించిన వస్త్రధారణ, దక్కన్ మినియేచర్‌లు, అరుదైన శాసనాలు, మధ్యయుగంలో యుద్ధాల్లో ప్రత్యేక పాత్ర పోషించిన వివిధ రకరకాల ఫిరంగులు, అంతర్జాతీయ పరిశోధకులు ఆసక్తిగా పరిశోధించే జైన శిల్పాలు.. ఇలా తరగని అరుదైన వారసత్వ సంపద ఈ మ్యూజియం సొంతం. కానీ, సందర్శకుల సంఖ్య రోజు 30, 40 మంది కూడా ఉండకపోవడం ఆలోచించాల్సిన అంశం.

**25 శాతమే సిబ్బంది.. వసతులు లేవు**

స్టేట్ మ్యూజియంలో 80 మంది ఉద్యోగులకు 20 మందే ఉన్నారు. సిబ్బంది లేక కొన్ని గ్యాలరీలను మూసేశారు. సందర్శకులకూ కనీస వసతులు లేవు. తలుపులు లేని మరుగుదొడ్లు.. విరిగిన కుర్చీలు.. పగిలిన కిటికీలు.. అరకొర విద్యుత్ దీపాలతో దారుణమైన పరిస్థితుల్లో మ్యూజియం ఉంది. వేర్వేరు ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకువస్తున్నారు. చివరకు ఇక్కడికి ఎందుకు వచ్చామా? అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నామమాత్రంగానే ప్రదర్శన**

ఇక్కడ ఎన్నో ఉన్నా ప్రదర్శిస్తోంది నామమాత్రమే. మూడు నాలుగు గ్యాలరీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈజిప్షియన్ మమ్మీతోపాటు, డెకరేటివ్ ఆర్ట్ గ్యాలరీ, బుద్ధ గ్యాలరీ, ఇస్లామిక్ ఆర్ట్‌గ్యాలరీ, అజంతా చిత్రకళ గ్యాలరీ, అరబిక్, పర్షియన్ శాసనాలతోపాటు, ఆరుబయట ఉన్న ఫిరంగులు, కాకతీయ మండపం, చెక్కతో చేసిన రథంతోపాటు శిల్పాలు మాత్రం చూడగలుగుతున్నారు. వందేళ్లనాటి భవనం పలుచోట్ల దెబ్బతింది. బయటి కళారూపాలు వానకు తడిచి, ఎండకు ఎండుతున్నా పట్టించుకోవడం లేదు.

**తీవ్ర నిరాశకు గురయ్యాం:** ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్ జిల్లా

40 మంది పిల్లల్ని విజ్ఞానయాత్రకు ఇక్కడికి తీసుకొచ్చాం. సగం కూడా ప్రదర్శించడం లేదు. ఏది చూసినా గేట్లు మూసి, తాళాలు వేసే ఉన్నాయి. ఉన్నవాటి వివరాలు సరిగ్గాలేవు. వివరించేవారు లేరు. పిల్లలు పది నిమిషాలు కూడా మ్యూజియంలో ఉండలేదు.

# మిరప రైతుకు ధరాఘాతం



ఖమ్మం : ఖమ్మం మిర్చి మార్కెట్‌లో గతేడాదితో పోల్చితే మిరప ధరలు సగానికి సగం పడిపోయాయి. గతేడాది సీజన్ ఆరంభంలో క్వింటా మిరప ధర గరిష్ఠంగా రూ.22వేలు పలకగా.. ఈసారి గరిష్ఠంగా రూ.14వేలు దక్కటమే గగనంగా మారింది. సీజన్ ఆరంభంలోనే ధరలు పడిపోతే.. కొత్త ఏడాదిలో అత్యధికంగా వచ్చే దిగుబడులను ఎలా అమ్ముకోవాలో తెలియటం లేదని రైతులు కుమిలిపోతున్నారు.

**దిగుబడుల్లో క్షీణత**

ఏటా పెరుగుతున్న పెట్టుబడులకు తోడు తెగుళ్ల దెబ్బతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిరప సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. గత సీజన్‌లో ఉభయ జిల్లాల్లో 1.50లక్షల ఎకరాల్లో పంట సాగవగా.. ఈసారి 95వేల ఎకరాలకే పరిమితమైంది. గతేడాది రైతులు ఆశించిన దానికన్నా ఎక్కువే మిరపకు ధర లభించింది. 2023 డిసెంబర్‌లో ఖమ్మం మార్కెట్‌కు కొత్త రకం మిర్చి రాక మొదలైంది. అప్పట్లో క్వింటా మిరప ధర రూ.22వేల వరకు పలకగా.. తాలు రకం మిరపకు రూ.11వేల వరకు దక్కింది. గతేడాది అనుభవంతో ఈసారి పంట సాగుచేసిన రైతులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు సరకు తీసుకొస్తున్నారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిరపనూ రైతులు, వ్యాపారులు విపణికి తెస్తున్నారు. అయితే ధరల పతనం రైతులను కుదేలు చేస్తోంది. ఈసారి మిరప ధర క్వింటాకు రూ.14వేలకు మించటం లేదు. తాలు రకం మిరపకు రూ.7వేలకు మించి పలకటం లేదు. ఈసారి దిగుబడులు క్షీణించటం రైతులకు శరాఘాతంగా మారింది. గతంలో ఎకరాకు 13 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈసారి ఆరు క్వింటాళు దాటడమే గగనమవుతోంది.

**గిట్టుబాటు అయ్యేదెలా..?**

మిరప సాగుకు రైతులు ఎకరాకు రూ.1-1.50లక్షల పెట్టుబడి పెడుతున్నారు. కలుపు మందులు, కూలీల ఖర్చు విపరీతంగా పెరిగింది. మార్కెట్‌కు రవాణా చేసేందుకు రూ.3వేల వరకు ఖర్చవుతోంది. తీరా మార్కెట్‌కు తీసుకొస్తే నాణ్యత, తేమశాతం, మచ్చలు, తాలు సాకుతో వ్యాపారులు అమాంతం ధర తగ్గించేస్తున్నారు. ఈసారి పెట్టుబడులు కూడా పూడే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు. విపణికి ఇప్పుడిప్పుడే సరకు రాక మొదలైందని, జనవరి నుంచి ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ధర మరింత పడిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప ఎగుమతులు తగ్గిపోవటం వల్లే ధరలు పతనమవుతున్నాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పది బస్తాల మిరపను ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చాను. మార్కెట్‌లో జెండా పాట రూ.16,700 నిర్ణయించారు. అయినా క్వింటా సరకును రూ.12-13వేలకే వ్యాపారులు కొంటున్నారు. తేమ, మచ్చ, తాలు సాకుతో ధర తగ్గిస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి క్వింటా మిర్చి రూ.19,500కు విక్రయించాను. ఈసారి ఈ ధరతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. రూ.20 వేలు దాటితేనే పెట్టుబడులైనా పూడుతాయి.

ఉపేందర్, తొడియాళ్లగూడెం, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా

ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాం. మిరప తీసేందుకు రూ.50వేల వరకు ఖర్చవుతోంది. ఈసారి దిగుబడి బాగా తగ్గింది. మార్కెట్‌కు వస్తే అసలు ధరలే లేవు. ఇక్కడి వ్యాపారులు అనేక సాకులు చూపి అమాంతం ధర తగ్గించి కొంటున్నారు. ఇలాగైతే మాకు అప్పులే మిగులుతాయి.

రామ్మూర్తి, కామేపల్లి, ఖమ్మం జిల్లా

# ‘డైట్’కు నూతన సొబగులు




ఖమ్మం : ఖమ్మంలోని జిల్లా విద్యా, శిక్షణ(డైట్) కళాశాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోని రెండింటికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా లభించగా ఇందులో ఖమ్మంలోని డైట్ కళాశాల ఒకటి. రూ.8.62కోట్లతో అభివృద్ధి పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల విద్యార్థులు ఇక్కడ ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ తీసుకుంటారు.

**రానున్న కొత్త కోర్సులు**

ప్రస్తుతం ఈ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును మాత్రమే నిర్వహిస్తుండగా ఇక నుంచి డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సు రానుంది. దీని ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ఎల్‌కేజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన శిక్షణను టీచర్లకు ఇస్తారు. వీరితో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకూ తర్ఫీదు అందనుంది.

**1990-91లో ప్రారంభమై..**

జిల్లా స్థాయిలో విద్యా, శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో జిల్లా విద్యా, శిక్షణ సంస్థ (డైట్)ను 1990-91లో ఏర్పాటు చేశారు. అప్పట్లో తొలిసారిగా టీటీసీ కోర్సు ప్రవేశపెట్టారు. ఏడాది కోర్సులో 150 సీట్లు ఉండేవి. ఉపాధ్యాయ శిక్షణకు ప్రాధాన్యమిచ్చి నాణ్యమైన విద్యావ్యవస్థ స్థాపనకు ఈ సంస్థ దోహదపడింది. 1991లో కొత్త భవనాలు సమకూరాయి. ఇవి ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి, విద్యాశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఉపయోగపడుతున్నాయి. 2000 సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) కోర్సు మొదలైంది. దీని వ్యవధి రెండేళ్లు. మొదటి సంవత్సరంలో 100 సీట్లు, రెండో సంవత్సరంలో 100 సీట్లతో భావి ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు.

**డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ..**

అనంతరం జరిగిన మార్పుల్లో 2014-15 విద్యాసంవత్సరంలో డీఈడీ కోర్సు డీఈఎల్ఎడ్(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సుగా మారింది. ఈ కోర్సులో మొదటి సంవత్సరంలో 100, రెండో సంవత్సరంలో 100 సీట్లున్నాయి. వీటిలో 50 సీట్లు ఆంగ్లమాధ్యమం, 50 సీట్లు తెలుగు మాధ్యమానికి కేటాయించారు. ఈ భవనాలు విద్యాశిక్షణలో వృత్తి పూర్వ, వృత్యంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే ముఖ్యకేంద్రంగా మారాయి.

సమకూరనున్న సౌకర్యాలు..

- అదనపు తరగతి గదులు
- ప్రహరీ
- గ్రంథాలయ భవనం
- కంప్యూటర్ రూమ్
- సెమినార్ హాల్, ప్రయోగశాలలు
- స్పెషల్ ఎడ్యుకేషన్ యూనిట్
- రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్
- శౌచాలయాలురీ క్యాంటీన్ ఏర్పాటు
- తాగునీటి వసతి
- పార్కింగ్ సౌకర్యం
- పాత భవనాలకు మరమ్మతులు

# విశ్వవేదిక.. బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్: మహానగరానికి కొత్త బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) దీనిపై కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో కొత్త మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేస్తున్నారు. కొత్త ఏడాదిలో సెప్టెంబరు, అక్టోబరు నాటికి దీనికి సంబంధించి ముసాయిదాను విడుదల చేయనున్నట్లు తాజాగా అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి..అభ్యంతరాలను స్వీకరించనున్నారు. **ఐదింటి స్థానంలో.. ఒక్కటే** ప్రస్తుతం మహానగర పరిధిలో 5 మాస్టర్‌ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏదైనా భారీ ప్రాజెక్టును చేపట్టే సందర్భంలో ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. ఇక నుంచి ఆ ఇబ్బంది లేకుండా ఒక్కటే మాస్టర్‌ప్లాన్ అందుబాటులోకి తెచ్చేందుకు కొన్నాళ్లుగా కసరత్తు చేస్తున్నారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు వసతులు కల్పించడం తలకు మించిన భారమే. తాగునీరు, మురుగు వ్యవస్థ, ప్రజారవాణా, పచ్చదనం, చెరువులను కాపాడుకోవడం అత్యవసరం. తాజా ప్రణాళికలో ఈ అంశాలన్నింటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, గ్రిడ్ రోడ్లు, మెట్రో సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రజారవాణాను పటిష్ఠం చేసేందుకు మొబిలిటీ ప్లాన్‌లో సూచనలు చేయనున్నారు. అభివృద్ధి మాటున ఈ నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా బ్లూ అండ్ గ్రీన్ పేరుతో ప్రత్యేక ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. పచ్చదనానికి పెద్దపీట వేసేందుకు తగిన అంశాలు ఇందులో పొందుపర్చనున్నారు. కొత్త ప్రణాళికలో మరో మూడు ప్రత్యేక ప్రణాళికలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అంతర్గతంగా మొబిలిటీ, ఎకానమీ, బ్లూఅండ్ గ్రీన్ ప్లాన్‌లు ఇందులో మిళితం కానున్నాయి. మొబిలిటీ ప్లాన్ కింద ఆర్ఆర్ఆర్ వరకు రవాణా సేవలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతమున్న హైదరాబాద్ మాస్టర్‌ప్లాన్-2031లో ఏడు జిల్లాల పరిధి మాత్రమే ఉంది. ప్రాంతీయ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు విస్తరించనున్నారు.

# పొలాల్లోకి మురుగు.. పంట కనుమరుగు

పెద్దేముల్: పంట కాలం నాలుగు నెలలు పూర్తి అయ్యింది. రాత్రి, పగలు కష్టించి పండించిన పంట కోతకొచ్చింది. కానీ సాగు చేసిన పంటను కోయలేని పరిస్థితిని ఆ రైతులు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం.. గ్రామంలోని మురుగు నీరంతా పొలాల్లోకి చేరి పంట దెబ్బతినడం. మండల కేంద్రం పెద్దేముల్‌లోని పోచమ్మ గుడి పరసర ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించి కథనం.

**బాధిత రైతులు 15 నుంచి 25 మంది**

పెద్దేముల్ మండలంలో దాదాపు 20 ఎకరాల్లో 15 నుంచి 25 మంది రైతులు ఖరీఫ్ కింద వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతలు మొదలు పెట్టాలి. అయితే గ్రామంలోని మురుగు నీరంతా వరి పొలాల్లోకి వచ్చి చేరుతోంది. రోజుల తరబడి నీరు పొలాల్లో నిల్వ ఉంటోంది. పొలాలు బురదగా మారి కోతలు కోయలేని విధంగా తయారైంది. పంట కాలం పూర్తి కావడంతో నిలువునా ఎండుతోంది. గింజలు రోజు రోజుకు రాలిపోతున్నాయి. బురదలో కూలీలు పని చేయడానికి వెనకంజ వేస్తున్నారు. యంత్రాలతో కోయించాలని చూసినా బురదలో ఇరుక్కుపోతామని వారు రావడంలేదు.



**ప్రత్యామ్నాయ మార్గం చూపక పోవడమే సమస్య**

గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలు తమ అవసరాలకు వినియోగించిన నీరు మురుగు కాల్వల ద్వారా బయటికి పోతోంది. గ్రామ పంచాయతీ వారు మురుగు ముందుకు వెళ్లేందుకు పెద్ద కాల్వను కాలనీ వరకు నిర్మించి వదిలేశారు. అక్కడి నుంచి వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో అవసరాలకు వినియోగించిన మురుగు నీరు నేరుగా పొలాల్లోకి చేరుతోంది. దీంతో వానాకాలం పొలాలు నీటితో నిండి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి.

**అవస్థలు పడలేక బీడుగా వదిలేశారు** పంట సాగు చేసినా లాభం లేదని కొందరు రైతులు పొలాలను బీడుగా వదిలేశారు. నీరు ముందుకు పోయే దారి చూపితేనే రైతుల కష్టాలు దూరమవుతాయి. జేసీబీ సాయంతో కాలువ తీసి మురుగు నీరు ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎండాకాలం వరకు పొలాలు నీటితోనే ఉంటాయని రైతు ఎర్ర బాలప్ప వాపోయారు. అధికారులు తక్షణమే పంటలు దెబ్బతినకుండా, మురుగు వెళ్లేందుకు వేరే మార్గం చూడాలన్నారు.

## అప్రమత్తతే ఆయుధం..

బషీరాబాద్ : సాంకేతికత ప్రజలకు చేరువయ్యే కొద్దీ ‘సైబర్ నేరాలు’ పెరిగిపోతున్నాయి. చేతికి ఏమాత్రం మట్టి అంటకుండా బ్యాంకు ఖాతాలు, ఫోన్లనుంచి రూ.వేలు, రూ.లక్షలు కాజేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఇప్పటివరకు ఎంత మేర జరిగాయి, దీని బారిన పడకుండా ఏంచేయాలి వంటి అంశాలతో ‘న్యూస్‌టుడే’ కథనం.

**అవగాహనకు 2023లో వారియర్ల ఏర్పాటు**

సైబర్ నేరాల తీరుపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడానికి 2023లో జిల్లాలో పోలీస్‌స్టేషన్‌కు ఒకరి చొప్పున 19 పోలీస్‌స్టేషన్లకు 19 మంది స్టేషన్ రైటర్లను వారియర్లుగా నియమించారు. వీరికి ఇదివరకే సైబర్ మోసాలను పసిగట్టడంలో, ఆన్‌లైన్ ద్వారా మోసగాళ్లు ఎలా మోసం చేస్తారో వాటిని ఎలా ఎదుర్కోవాలో నిపుణులతో శిక్షణ ఇచ్చారు. దీన్లో నేర్చుకున్న అంశాలనే సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**వెంటనే చెబితే మంచిది**

సైబర్ మోసానికి గురైనట్టు గుర్తించగానే వెంటనే ఫోన్ చేసి వివరాలు చెబితే మంచిది. అధికారులు తక్షణం స్పందించి ఆ నగదు ఇతర ఖాతాల్లోకి జమ కాకుండా నిలిపి వేస్తారు. ప్రశాంత్‌రెడ్డి, డీఎస్పీ, సైబర్ నేరాల నియంత్రణ, వికారాబాద్.




**ఇవి గుర్తుంచుకోండి**

ఏ బ్యాంకు వారూ ఫోన్‌చేసి అకౌంట్ వివరాలు, పిన్ నంబర్ అడగరు. మీ అకౌంట్ అప్‌డేట్ చేయాలని అడిగితే మోసపూరితమని గుర్తించాలి. తెలియని లింక్‌లను ఓపెన్ చేయకూడదు.

బ్యాంకులు, ఆడిట్, ఆదాయ పన్ను, పోలీస్ అధికారుల పేరుతో ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి.

డెబిట్, కార్డు, క్రెడిట్ కార్డుల వాడకంలో జాగ్రత్త వహించాలి.

గత డిసెంబరులో తాండూరుకు చెందిన ఓ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అధిక వడ్డీ ఆశచూపి రూ.14 లక్షలు కాజేశారు. చివరకు తాను మోసపోయానని గ్రహించి తాండూర్ పోలీసులను ఆశ్రయించారు. కేసును వికారాబాద్ సైబర్ ఠాణాకు బదిలీ చేశారు. కేసు పరిశోధించి సైబర్ నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ.4 లక్షలను స్తంభింపజేశారు.

పరిగి పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత అమ్మాయి ఫోన్ చేసి మాటల్లోఇ దించి అతడి నగ్న వీడియో తీసింది. దాన్ని చూపి బెదిరించడంతో రూ.60 వేలకు పైగా సమర్పించుకున్నాడు. పోలీసులను ఆశ్రయించడంతో వేధింపులు ఆగిపోయాయి.


సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నం. 1930

గత ఏడాది కంటే పెరిగిన సైబర్ కేసులు

బాధితులు నష్టపోయింది: రూ.3.1 కోట్లు

స్వాధీనం చేసుకుంది: రూ.80 లక్షలు

నిలిపివేసిన మొత్తం: రూ.60 లక్షలు




## సంధ్య థియేటర్ ఘటన.. అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించిన పవన్‌కల్యాణ్

అమరావతి: సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన, సినీనటుడు అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. మంగళగిరిలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారని వ్యాఖ్యానించారు. "తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి గొప్ప నాయకుడు. కిందిస్థాయి నుంచి ఎదిగారు. వైకాపా విధానాల తరహాలో అక్కడ వ్యవహరించలేదు. ఆ రాష్ట్రంలో బెనిఫిట్‌షోలకు అవకాశమిచ్చారు. టికెట్ ధర పెంపునకూ వెసులుబాటు కల్పించారు. ఆయన సహకారంతోనే సినిమాల కలెక్షన్లు పెరిగాయి. 'సలార్', 'పుష్ప2'వంటి సినిమాలకు భారీ వసూళ్లు వచ్చాయి. 'పుష్ప2' సినిమాకు సీఎం రేవంత్ పూర్తిగా సహకరించారు. టికెట్ రేట్ల పెంపునకు అవకాశం ఇవ్వడం కూడా చిత్ర పరిశ్రమను ప్రోత్సహించడమే అవుతుంది. అల్లు అర్జున్ విషయంలో తెర ముందు, వెనుక ఏం జరిగిందో నాకు పూర్తిగా తెలియదు. చట్టం అందరికీ సమానం. ఇలాంటి ఘటనల్లో పోలీసులను తప్పుపట్టను. భద్రత గురించే వారు ఆలోచిస్తారు. థియేటర్ స్టాఫ్ కూడా అల్లు అర్జున్‌కు ముందు చెప్పి ఉండాల్సింది. పోనీ, సీట్లో ఆయన కూర్చొన్నాక అయినా, చెప్పి తీసుకెళ్లాల్సింది"

**ఈ ఏడాది 199 చిత్రాల్లో 26 మాత్రమే హిట్.. రూ.700 కోట్ల నష్టం! :** "అల్లు అర్జున్ తరఫున ఎవరో ఒకరు బాధిత కుటుంబం వద్దకు ముందే వెళ్లి ఉంటే బాగుండేది. ఈ ఘటనలో రేవతి చనిపోవడం నన్ను కలచి వేసింది. గోటితో పోయే దాన్ని గొడ్డలి వరకూ తెచ్చారు. మేమంతా అండగా ఉన్నామని ముందే చెప్పి ఉండాల్సింది. తమ ప్రమేయం లేకుండా తప్పు జరిగి పోయిందని విచారం వ్యక్తం చేయాల్సింది. ఈ విషయంలో ఎక్కడో మానవతా దృక్పథం లోపించింది. అందరూ రేవతి ఇంటికి వెళ్లి భరోసా ఇచ్చి ఉండాల్సింది. పరామర్శించకపోవడం వల్లే ప్రజల్లో ఆగ్రహం వచ్చింది. తన వల్లే ఒకరు చనిపోయారనే వేదన అర్జున్‌లో ఉంది" "సినిమా అంటే టీమ్.. అందరి భాగస్వామ్యం. అల్లు అర్జున్ ఒక్కడినే దోషిగా మార్చడం కూడా కరెక్ట్‌కాదు. తొక్కిసలాట ఘటన తర్వాత చోటు చేసుకున్న పరిణామాలపై సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి స్పందించారు. కొన్నిసార్లు పరిస్థితులను బట్టి నిర్ణయాలు ఉంటాయి. చిరంజీవి కూడా గతంలో అభిమానులతో కలిసి సినిమాలు చూసేందుకు వెళ్లేవారు. కాకపోతే ఆయన ముసుగు వేసుకుని ఒక్కరే థియేటర్‌కు వెళ్లేవారు"

**క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి..** "సినిమా పరిశ్రమలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. పరిశ్రమలోని వారందరూ కూర్చొని మాట్లాడాలి. రాష్ట్రంలో పాపికొండలు వంటి చక్కటి లొకేషన్లు ఉన్నాయి. విజయనగరం అటవీ ప్రాంతంలోనూ అందమైన ప్రదేశాలున్నాయి. ఈ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు అవసరం. ఇండస్ట్రీలో క్వాలిటీ ఆఫ్ ఫిల్మ్ మేకింగ్ ఉండాలి. స్టోరీ టెల్లింగ్ స్కూల్స్ రావాలి. అప్పుడే మంచి సినిమాలు సాధ్యం" అని పవన్‌కల్యాణ్ అన్నారు.




## రన్‌వే చివర కాంక్రీట్ గోడా..: అదే 179 మంది ప్రాణాలు తీసిందా..?

దక్షిణ కొరియాలోని ముయాన్ ఎయిర్‌పోర్టులో జరిగిన విమాన ప్రమాదంలో మరో అంశం బయటకు వచ్చింది. రన్‌వే చివర కాంక్రీట్ గోడ నిర్మించడాన్ని నిపుణులు తప్పుపడుతున్నారు. అది లేకపోతే.. కనీసం మరికొంత మంది ప్రాణాలైనా దక్కేవని చెబుతున్నారు. ప్రమాద తీవ్రత కూడా ఈ స్థాయిలో ఉండేది కాదని అంటున్నారు. వాస్తవానికి ఈ విమానం రన్‌వేపై అత్యవసరంగా దిగే సమయంలో ల్యాండింగ్ గేర్ పనిచేయలేదు. దీంతో ఇది బాడీపైనే బెల్లీ ల్యాండింగ్ చేసింది. అప్పటికే ఒక ఇంజిన్‌ను పక్షి ఢీకొనడంతో దానిలో శక్తి కూడా గణనీయంగా తగ్గింది. దీంతో ల్యాండ్ అయ్యాక నియంత్రణ కోల్పోయి ముందుకు దూసుకెళ్లింది. రన్‌వే దాటాక.. చివర నిర్మించిన ఓ కాంక్రీట్ గోడను ఢీకొని ఒక్కసారిగా అగ్నిగోళం వలే మండింది. దీనిపై వైమానిక రంగ నిపుణుడు డేవిడ్ లియర్‌మౌంట్ స్కైన్యూస్‌తో మాట్లాడుతూ.. అక్కడ గోడ లేకపోతే.. కంచెను దాటుకొని విమానం సమీపంలోని పొలాల్లోకి వెళ్లి ఆగేదన్నారు. దాదాపు ప్రతి ఒక్కరి ప్రాణాలు దక్కేవన్నారు. ముయాన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే చిన్నది కావడంవల్ల ప్రమాదం జరిగిందని వచ్చిన వార్తలను అధికారులు ఖండిస్తున్నారు. రన్‌వే 2,800 మీటర్ల పొడవుందని, సీ టైప్ విమానాలు దిగడానికి అనువుగానే ఉందని వివరించారు.

**సకాలంలో స్పందించలేదా..?....** చాలా యాంత్రిక, ప్రొసీజరల్ సమస్యలను ఇన్వెస్టిగేషన్ గుర్తించినట్లు ది టైమ్స్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా ఎయిర్ క్రాఫ్ట్ థ్రస్ట్ రివర్సర్స్, ఫ్లాప్స్, స్పీడ్‌బ్రేక్స్ వంటివి పూర్తి స్థాయిలో పనిచేయలేదని చెబుతున్నారు. మరోవైపు ఏవియేషన్ నిపుణుడు జెఫ్రీ థాంప్సన్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది పూర్తి స్థాయిలో సన్నద్ధంగా లేకుండానే విమానం నేలపైకి దిగడానికి అనుమతించినట్లుందన్నారు. పక్షులు ఇంజిన్ ఢీకొన్నా.. అత్యంత అరుదుగా మాత్రమే ఇంత భారీ ప్రమాదాలు చోటు చేసుకొంటాయని చెబుతున్నారు. మరోవైపు విమాన పైలట్‌కు 9,800 గంటల అనుభవం ఉంది. అతడు 2019 నుంచి విధుల్లో ఉన్నాడు.




చెన్నై: తన అనుమతి తీసుకోకుండా తాను మాట్లాడిన విషయాన్ని ఏవిధంగా రికార్డు చేస్తారని నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఫోన్‌లో చెప్పిన మాటలు వాస్తవమేనని ఆమె అన్నారు. అయినప్పటికీ, ఫోన్ సంభాషణను ఈ విధంగా రికార్డు చేయడం బాలేదన్నారు. తమిళనాడులో చోటు చేసుకున్న పరిణామాలపై స్పందించమని కోరుతూ స్థానిక మీడియా సంస్థ ఫోన్ కాల్‌లో ఆమెను సంప్రదించింది. భాజపా ఆధ్వర్యంలో ఆ రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై విలేకరి ఆమెను ప్రశ్నించాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. తమిళనాడు భాజపా తనని పట్టించుకోవడం లేదని తెలిపారు. దీనికి సంబంధించిన ఆడియో రికార్డ్‌ను సదరు మీడియా సంస్థ ఎక్స్ వేదికగా షేర్ చేసింది. ఆమె అనుమతితోనే దీనిని రిలీజ్ చేస్తున్నామని పేర్కొంది. దీనిపై తాజాగా ఆమె స్పందించారు. "మరి ఇంత దిగజారుతారని అనుకోలేదు. నా అనుమతి తీసుకోకుండా ఈవిధంగా నా వాయిస్ ఎలా రికార్డు చేస్తారు? కానీ, నేను నిజమే చెప్పా. భాజపా కార్యక్రమాల్లో మీరెందుకు కనిపించడం లేదని నన్ను ఎవరైనా ప్రశ్నిస్తే.. వారందరికీ ఒక్కటే సమాధానం చెబుతా. ఆయా కార్యక్రమాలకు సంబంధించి నాకు ఎలాంటి సమాచారం ఇవ్వరు. వాటికి నన్ను ఆహ్వానించరు. ఒకవేళ సమాచారం ఇచ్చినా చివరి నిమిషంలో చెబుతారు. కొంతమంది ఊహిస్తున్నట్లు నేను అయితే పార్టీని వీడటం లేదు. ప్రధాని నరేంద్రమోదీ విజన్, ఆయన ప్రవేశ పెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తా" అని ఖుష్బూ పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఖుష్బూ అనుమతితోనే తాను ఇది షేర్ చేశామని మీడియా సంస్థ పేర్కొనడంపై ఆమె మరోసారి స్పందించారు. "ఆ సంస్థ చెబుతున్న దానిలో నిజం లేదు. ఈ విషయాన్ని వారు నా దృష్టికి ఏమాత్రం తీసుకురాలేదు. ఫోన్ కాల్ రికార్డు చేస్తున్నామని మీరు నాకెప్పుడు చెప్పారు?" అని ప్రశ్నిస్తూ మరో పోస్ట్ పెట్టారు.




కోరుకొండ: తూర్పుగోదావరి జిల్లాలో రేవ్‌పార్టీ కలకలం రేగింది. కోరుకొండ మండలం బూరుగుపూడి గేట్ సమీపంలోని కల్యాణ మండపంలో తెల్లవారుజామున రేవ్ పార్టీపై పోలీసు ప్రత్యేక సిబ్బంది దాడి చేశారు. దీనిలో పాల్గొన్న ఐదుగురు మహిళలు, 14 మంది పురుషులను అదుపులోకి తీసుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రేవ్‌పార్టీ ఏర్పాటు చేసినట్లు సమాచారం.

నిందితులు ఓ ఫెర్టిలైజర్ కంపెనీకి చెందినవారిగా సమాచారం. వారు గుంటూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చినట్లు తెలిసింది.




మంగళగిరి: "రేషన్ బియ్యం మాయమైంది నిజం.. డబ్బులు కట్టింది వాస్తవం.. ఇంట్లో ఆడవాళ్ల పేరుతో గిడ్డంగి పెట్టిందెవరు?" అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన వారిని మీరు తిట్టలేదా.. అని నిలదీశారు. మంగళగిరిలో పవన్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. "వైకాపా నేత పేర్ని నాని చేసిన తప్పులే ఆయన ఇంట్లో వాళ్లను వీధిలోకి తెచ్చాయి. అప్పుడు బూతులు తిట్టి, ఇప్పుడు నీతులు వల్లిస్తే ఎలా? గత ప్రభుత్వం కన్నా కూటమి ప్రభుత్వం చాలా గొప్పగా పనిచేస్తోంది. అడ్డగోలు నిర్ణయాలపై అధికారులు కూడా చెప్పలేకపోతున్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేశారు, పనిచేసే సంస్కృతిని చంపేశారు. గత ప్రభుత్వం తొలి 6 నెలలు, ఈ ప్రభుత్వం 6 నెలల పాలన బేరీజు వేసుకోండి. ఆకాశానికి, భూమికి ఉన్నంత తేడా ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల కోసం పనిచేయాలని చెబుతున్నాం.

పాలన తీరు, ప్రజా సమస్యల పరిష్కారంపైనే ఇప్పటివరకు దృష్టి పెట్టాం. ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రతి సమస్యను పరిష్కరిస్తాం. ఎన్డీఏ ఆధ్వర్యంలో చాలా బాధ్యతతో పనిచేస్తున్నాం. పదవులు అనుభవించడం కాదు.. బాధ్యతతో పనిచేస్తాం. ప్రతి గ్రామానికి తాగునీరు ఇవ్వాలనేది ప్రధాని మోదీ కల. తాగునీరు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాం" అని పవన్ కల్యాణ్ చెప్పారు.

## పోలీసుల అదుపులో కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్



మచిలీపట్నం: వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాములో బియ్యం మాయం కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఆదివారం గోదాము మేనేజర్ మానస తేజను, సోమవారం కృష్ణా జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ కోటి రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో కోటి రెడ్డికి ప్రమేయముందని పోలీసుల అనుమానిస్తున్నారు. పేర్ని నాని గోదాములో రేషన్ బియ్యం మాయమయ్యాయని కోటి రెడ్డి ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బియ్యం నిల్వల మాయం అంశంలో తనపై అనుమానం రాకుండా పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశారు. మానస తేజ, కోటి రెడ్డిని నేడు అరెస్ట్ చూపించే అవకాశముంది. నేడు మచిలీపట్నం జిల్లా కోర్టులో పేర్ని నాని సతీమణి జయసుధ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణకు రానుంది.

## జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తా: ప్రశాంత్ కిశోర్

బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) కంబైన్డ్ కాంపిటేటివ్ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో గత పది రోజులుగా నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్నారు. వీరిపై ఆదివారం పోలీసులు జల ఫిరంగులు ప్రయోగించి.. లాఠీఛార్జి చేసిన విషయం తెలిసిందే. అభ్యర్థులపై పోలీసుల చర్యలను జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ ఖండించారు. పేపర్ లీక్‌పై పోరాడుతున్న యువతపై పోలీసులు అనుసరించిన వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. పోలీసుల చర్యలకు నిరసనగా జనవరి 2 నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని ప్రకటించారు. కాగా ఆదివారం రాత్రి పోలీసులు విద్యార్థులపై లాఠీఛార్జి చేస్తున్న సమయంలో ప్రశాంత్ కిశోర్ అక్కడినుంచి వెళ్లిపోతునన్నట్లుగా పలు వీడియో దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో విద్యార్థులకు, ఆయనకు మధ్య వాగ్వాదం నెలకొంది.



తమపై పోలీసులు లాఠీఛార్జి చేసేటప్పుడు అక్కడ ఉండకుండా ఎందుకు వెళ్లిపోయారని అభ్యర్థులు ఆయనను ప్రశ్నించారు. నిరసన ప్రాంతం నుంచి ప్రశాంత్ కిశోర్ వెంటనే వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తూ.. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా విద్యార్థులు తనపై చేసిన ఆరోపణలను ప్రశాంత్ కిశోర్ ఖండించారు. వారి ఉద్యమానికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. పోలీసులు లాఠీఛార్జి చేస్తుండడంతో విద్యార్థులను అక్కడినుంచి వెళ్లాలని సూచిస్తూ తాను మరో చోటికి వెళ్లానన్నారు.

## కోనసీమలో సై అంటే సై అంటున్న మంత్రి, ఎంపీ



కోనసీమ జిల్లా, డిసెంబర్ 30: జిల్లాలోని రామచంద్రాపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ వర్సెస్ వైసీపీ ఎంపీ పిల్లి బోస్ అన్నట్లుగా పరిస్థితులు మారాయి. నిన్న (ఆదివారం) మంత్రి సుభాష్ విసిరిన సవాల్‌కు స్పందనగా ఓపెన్ డిబేట్‌కు వైసీపీ ఎంపీ సిద్ధమయ్యారు. తన ఆరు నెలల పాలనలో అభివృద్ధి, గత ఐదేళ్ల వైసీపీ అవినీతిపై డిబేట్‌కు రావాలని బోస్‌కు మంత్రి సవాల్ విసిరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. " బహిరంగ డిబేట్ ఎక్కడ? ఎప్పుడు ఏర్పాటు చేసినా నేను, నా కుమారుడు వస్తాము" అని సవాల్ విసిరారు.

ప్రజల్ని తాము పీడించలేదని.. టీడీపీ కార్యాలయంలో డిబేట్ పెట్టినా రావడానికి సిద్ధమని బోస్ స్పష్టం చేశారు. "మీ నాయకుడు ఉత్తముడుగా చేయడం లేదు.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు" వీటిపై చర్చిద్దాం రమ్మంటూ మంత్రికి బోస్ ఛాలెంజ్ చేశారు. ఎన్నికల హామీలు నూటికి నూరుశాతం అమలు చేసిన ఎన్నికలకు వెళ్లిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. "నేను ఒక రాజకీయ నాయకుడిని.. సంఘ సంస్కర్తను కాను... మా పార్టీలో వారు అవినీతికి పాల్పడితే ఆ విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళతా కానీ సంఘ సంస్కర్తలా ప్రకటనలు చేయం. గత ఐదేళ్లలో మా పార్టీ నాయకుడు అవినీతికి పాల్పడ్డాడని నీ దగ్గర ఆధారాలు ఉంటే నీవు మంత్రివిగా అతనిపై కేసు పెట్టి అరెస్టు చేయించు. అంతేగానీ గతంలో వేణుగోపాల కృష్ణను ఏమి అడుగు లేదు కాబట్టి నేను అవినీతి చేస్తే అడుగకూడదు అనే భావనతో మంత్రి వాసంశెట్టి ముందరి కాళ్లకు బంధం వేస్తున్నట్లుగా ఉంది. ప్రతిపక్షంగా మీరు చేస్తున్న అవినీతిని ప్రశ్నిస్తూనే ఉంటామని ఎంపీ బోస్ స్పష్టం చేశారు.

**మంత్రి సవాల్...** కాగా.. వైసీపీ ఎంపీపై మంత్రి సుభాష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్లలో రామచంద్రాపురంలో అంతులేని అవనీతి జరిగిందని ఆరోపించారు. దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు మంత్రి. కౌలు రైతుల పేర్లతో క్రాప్ ఇన్స్యూరెన్స్ కూడా మింగేశారని వైసీపీ నేతలపై మండిపడ్డారు. మాజీ మంత్రి వేణు, బోస్ వాటాలు పంచుకున్నారా అని నిలదీశారు. ఏరియా ఆస్పత్రులు, ద్రాక్షరామ ఆలయంలోనూ అవినీతి జరిగిందన్నారు. ఆరు నెలల పాలనలో అభివృద్ధి, గత ఐదేళ్ల వైసీపీ అవినీతిపై డిబేట్‌కు రావాలని ఎంపీ బోస్‌కు మంత్రి వాసంశెట్టి సుభాష్ సవాల్ విసిరడం చర్చనీయాంశంగా మారింది.

# మినీ స్కర్ట్ స్టైలిష్ లుక్‌లో జాన్వీ!

అతిలోక సుందరి శ్రీదేవి నట వారసురాలు జాన్వీ కపూర్ ఎట్టకేలకు దేవర సినిమాతో బాలీవుడ్ నుంచి టాలీవుడ్‌కి వచ్చింది. ఎన్టీఆర్‌కు జోడీగా నటించిన 'దేవర' సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో టాలీవుడ్‌లో ఈ అమ్మడు పెద్ద సినిమాలు చేయబోతుంది. దేవర విడుదలకు ముందే రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబో మూవీలో జాన్వీ కపూర్ ఎంపిక అయ్యింది. ఆ సినిమా షూటింగ్ కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. అన్ని అనుకున్నట్లుగా జరిగితే 2025లోనే చరణ్ తో జాన్వీ కపూర్ మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు దేవర 2 సినిమాలోనూ జాన్వీ కపూర్ పాత్ర పరిధి పెరగనుందనే వార్తలు వస్తున్నాయి. టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ సినిమా ఛాన్స్‌లు దక్కించుకుంటున్న ఈ అమ్మడు బాలీవుడ్‌ను వదలడం లేదు. తన మొదటి ప్రాధాన్యత బాలీవుడ్ సినిమాలు అన్నట్లు అక్కడే ఎక్కువ సినిమాలు చేస్తోంది. ఈ ఏడాది సైతం బాలీవుడ్ ప్రేక్షకులు ఈ అమ్మడి సినిమాలను ఆధరించలేదు. వెబ్ సిరీస్‌లతోనూ ఈమె ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఏ ఒక్క సినిమాతో ఈమెకు పాజిటివ్ రెస్పాన్స్ దక్కలేదు. హిందీలో తక్కువ పారితోషికంకు సినిమాలు చేసేందుకు ఈమె రెడీగా ఉంది. కానీ అక్కడ స్టార్ హీరోలు, పెద్ద ఫిల్మ్ మేకర్స్ ఈమెను పెద్దగా పట్టించుకోవడం లేదు. సోషల్ మీడియాలో ఈమెకు సంబంధించిన ఫోటోలు రెగ్యులర్‌గా వైరల్ అవుతాయి. తాజాగా మరోసారి ఈమె తన అందాల ఆరబోత ఫోటోలతో వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి



ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ ఉంటారు. నిజంగానే ఈమె మంచి ఫిజిక్‌తో ఫ్యాన్స్‌ను కవ్విస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా ఫోజ్‌లు ఇస్తూ షేర్ చేసే ఫోటోలు వైరల్ అవుతూ ఉంటాయి. ఈసారి మినీ స్కర్ట్‌లో అందంగా స్టైలిష్ లుక్‌లో కనిపించి ఆకట్టుకుంది. అందమైన ఈ అమ్మడి అందానికి నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. గతంలో ఎన్నో సార్లు చీర కట్టు ఫోటోలు, స్కిన్ షో ఫోటోలను షేర్ చేసిన ఈ అమ్మడు ఇప్పుడు ఇలా థైస్ అందాలను చూపిస్తూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. స్టైలిష్ లుక్ లో జాన్వీ కపూర్ చూపులతో చంపేస్తుంది. ఇంతటి అందగత్తెకు బాలీవుడ్‌లో సరైన హిట్ పడక పోవడం విడ్డూరంగా ఉంది. టాలీవుడ్‌లో ఇలాంటి హీరోయిన్స్‌కి మంచి డిమాండ్ ఉంది. కనుకే దేవర సినిమా విడుదలకు ముందే చరణ్ వంటి పెద్ద హీరో సినిమాలో ఛాన్స్ దక్కించుకుంది. ఆమె ఓకే అనాలే కానీ ఏడాదికి మూడు నాలుగు సినిమాల్లో నటించే అవకాశాలు కేవలం టాలీవుడ్ నుంచి వచ్చే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జాన్వీ కపూర్ ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం మాత్రమే కాకుండా నటనతోనూ తనకు ఛాన్స్ వచ్చిన సమయంలో నిరూపించుకుంటూ ఉంది. తల్లికి తగ్గ కూతురు అనిపించుకునేందుకు జాన్వీ కపూర్ చాలా కష్టపడుతోంది.

# దేవి నాగవల్లి మరో యూ టర్న్

సంపాదించుకున్నారు. ఎప్పుడు ముక్కుసూటిగా క్వశ్చన్ చేస్తుంటారు.. ఆన్సర్ ఇస్తుంటారు.. కొన్నిసార్లు వివాదాల్లో కూడా నిలుస్తుంటారు! అయితే నాగవల్లి.. బిగ్ బాస్-4 హౌస్ లోకి కూడా వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు 22 రోజుల పాటు హౌస్ లో ఉన్న ఆమె.. ఆ తర్వాత ఎలిమినేట్ అయ్యారు. అనంతరం మళ్లీ మీడియాలోనే కంటిన్యూ అయ్యారు. అలా మొత్తానికి జర్నలిజం ఫీల్డ్ లో దేవి నాగవల్లి.. తనకంటూ మంచి అనుభవం, పాపులారిటీ సొంతం చేసుకున్నారని చెప్పాలి. ఇప్పుడు ఆమె తాను వర్క్ చేసిన మీడియా ఛానల్ కు గుడ్ చెప్పినట్లు తెలుస్తుంది. దీంతో ఆమెకు సహోద్యోగులు ఫేర్ వెల్ ఇచ్చిన వీడియోస్ అండ్ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఆల్ ది బెస్ట్ అని రాసిన ఉన్న కేక్ ను కట్ చేసిన దేవి నాగవల్లి.. ఎమోషనల్ అయ్యారు. తన కొలీగ్స్ అందరితో క్వాలిటీ టైమ్ స్పెండ్ చేశారు. అయితే ఇకపై నాగవల్లి.. సినీ ఇండస్ట్రీలో



బిజీగా గడపనున్నారని, అందుకే మీడియాకు గుడ్ బై చెప్పినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ గా చిత్రసీమలో అడుగు పెట్టనున్నట్లు సమాచారం. రీసెంట్ గా వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ అయిన పుష్ప-2కు ఆమె అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేశారు. ఆ విషయాన్ని ఆమెనే సోషల్ మీడియాలో తెలిపారు. టైటిల్ కార్డ్స్ లో నాగవల్లి పేరును కూడా సుకుమార్ వేశారు. పెద్ద పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీలో ఇసుక రవ్వంత పని చేస్తే సుకుమార్ కొండంత గుర్తింపు ఇచ్చారని నాగవల్లి కొనియాడారు. మీ దగ్గర పాఠాలు నేర్చుకోవడం తన అదృష్టమని తెలిపారు. ఎంతో ధైర్యమిచ్చారని చెప్పారు. సుకుమార్ కూడా ఆమెపై ప్రశంసలు కురిపించారు. దీంతో ఇప్పుడు దేవి నాగవల్లి.. సుకుమార్ శిష్యురాలిగా ఇండస్ట్రీలోకి డైరెక్టర్ గా ఎంట్రీ ఇవ్వనున్నారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సుక్కూ శిష్యులు అనేక మంది అడుగుపెట్టి మంచి సక్సెస్ అయిన విషయం తెలిసిందే.

అదే సమయంలో ఆమె ఇంకొంత కాలం అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేస్తారని మరో టాక్ వినిపిస్తోంది. మరి వీటిలో నిజమేదో నాగవల్లి స్పందిస్తే కానీ తెలియదు.




# ఆ నలుగురిలో ఆ ఒక్కరే బంపర్ హిట్టు!



బాలీవుడ్‌లో ఆలియా భట్ స్టార్ డమ్ అసాధారణ స్థాయికి చేరుకుంది. జయాపజయాలతో పని లేకుండా స్టార్ డమ్ ని కొనసాగించే స్థాయి ఆలియాకు ఉంది. దీపిక పదుకొనే తర్వాత మళ్లీ ఆ స్థాయిని అందుకున్న ఏకైక బ్యూటీ. కానీ ఈ ఏడాదిలో ఆలియా నటించిన 'జిగ్రా' తీవ్రంగా నిరాశపరిచిన సంగతి తెలిసిందే. వసంత బాలన్ తెరకెక్కించిన ఈ సినిమా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ తో తెరకెక్కింది. అయితే వీక్ నేరేషన్ కారణంగా నెగెటివ్ టాక్ తెచ్చుకుంది. ఆలియా నటప్రతిభ కూడా బాక్సాఫీస్ వద్ద ఆదుకోలేదు. ఈ చిత్రంలో వేదాంగ్ రైనా ఆలియాకు సోదరుడిగా నటించాడు. అప్ కమ్ హీరోకి ఇది నిరాశాజనక ఫలితం. అయితే ఆలియా తర్వాత వెండితెరపై వేగంగా దూసుకొస్తున్న కథానాయికల జాబితాను పరిశీలిస్తే .. ఇందులో ముగ్గురు నటవారసురాళ్లు కూడా ఉన్నారు. ఆ ముగ్గూరు ఎవరో కాదు.. జాన్వీ కపూర్, సారా అలీఖాన్, అనన్య పాండే. 2024లో ఈ ముగ్గురు క్రేజీ భామలు బాక్సాఫీస్ వద్ద అదృష్టం పరీక్షించుకోగా, వారిలో ఒక్కరు మాత్రమే ఆశించిన బాక్సాఫీస్ విజయాన్ని దక్కించుకోగలిగారు. సైఫ్ ఖాన్ నటవారసురాలు సారా అలీఖాన్ నటించిన జర హట్కే జర బచ్చే బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. 40 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కించిన ఈ చిత్రం 116 కోట్లు వసూలు చేసింది. ఈ చిత్రంలో సారా సరసన విక్కీ కౌశల్ కథానాయకుడిగా నటించాడు. సారా ఈ ఏడాది హిట్టు కొట్టి మాంచి జోష్ తో కొత్త సంవత్సరానికి వెల్ కం చెబుతోంది. ఇదే ఏడాది మరో నటవారసురాలు జాన్వీ కపూర్ రెండు సినిమాల్లో నటించింది. మిస్టర్ అండ్ మిసెస్ మాహి, ఉలఝ్ చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద అదృష్టం పరీక్షించుకుంది. కానీ ఈ రెండు సినిమాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన సినిమాలు బాగా ఆడేందుకు జాన్వీ ప్రచారంలోను దూకుడు ప్రదర్శించినా ఏదీ కలిసి రాలేదు. మిస్టర్ అండ్ మిసెస్ మాహి ప్రచారం కోసం ధోని పేరు ఉపయోగించుకున్నా అది కలిసి రాలేదు. ఇందులో రాజ్ కుమార్ రావు కీలక పాత్ర పోషించారు. అలాగే ఉలఝ్ చిత్రంలో గుల్షన్ దేవయ్య కథానాయకుడిగా నటించాడు. ఈ రెండు సినిమాల పరాజయం జాన్వీని పూర్తిగా ఆలోచనలో పడేశాయి. బాలీవుడ్ లో ఆశించిన హిట్టు పడక జాన్వీ నిరాశపడింది. ఇక ఎన్టీఆర్ సరసన 'దేవర' లాంటి బ్లాక్ బస్టర్‌లో జాన్వీ నటించినా కానీ, తన పాత్రకు పరిధి చాలా పరిమితం అని విమర్శలొచ్చాయి. మరోవైపు ఆదిత్యా రాయ్ కపూర్ నుంచి విడిపోయిన అనన్య పాండే తిరిగి కెరీర్ పై శ్రద్ధ పెడుతూ ఈ ఏడాది రెండు వరుస చిత్రాల్లో నటించింది. అనన్య పాండే నటించిన 'కంట్రోల్' (సిటి ఆర్.ఎల్) నెట్ ఫ్లిక్స్ లో విడుదల కావడంతో ఇక థియేట్రికల్ గా మాట్లాడుకోవడానికేమీ లేదు. అక్షయ్ కుమార్, తాప్సీ లాంటి తారలతో తెరకెక్కిన మల్టీస్టారర్ 'ఖేల్ ఖేల్ మే' చిత్రంలోను అతిథిగా నటించింది. కానీ తన పాత్ర పరిధి అంతంత మాత్రమే. అందువల్ల అనన్యకు ఈ ఏడాది అంతగా కలిసొచ్చిన సంవత్సరం కాదు. ఆ ముగ్గురు నటవారసురాళ్లలో సారా అలీఖాన్ మాత్రమే సోలోగా ఆశించిన పెద్ద హిట్టందుకుంది.

# 96 సీక్వెల్ అంత ఈజీ కాదు సుమా..!




కొత్త కథ కథనాలతో సినిమా రూపురేఖలను మార్చేస్తున్నారు యువతరం కథానాయకులు. ముఖ్యంగా ప్రేమ కథలను చెప్పే తీరు మారుతుంది. ఒకప్పుడు ప్రేమ విఫలమవడమే సినిమా క్లైమాక్స్ గా చూపించే వారు. కానీ ఇప్పుడు అదే మొదలుగా చేసుకుని కథలు రాసుకుంటున్నారు. తమకు ఆడియన్ ఇచ్చిన రెండున్నర గంటల టైం లో తమ క్రియేటివిటీతో సర్ ప్రైజ్ చేస్తున్నారు. వెండితెర మీద వెల కొద్దీ ప్రేమ కథలు చూశాం చూస్తూనే ఉంటాం. తెర మీద సూపర్ హిట్ సక్సెస్ ఫార్ములా అంటే అది లవ్ స్టోరీనే. ఐతే ఈ కథ ఎలా చెప్పామన్నది ప్రేక్షకుడు ఆలోచిస్తాడు. 2018 లో వచ్చిన 96 సినిమా సంథింగ్ స్పెషల్ అనిపిస్తుంది. ప్రేమ్ కుమార్ డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమా యూత్ ఆడియన్స్ కి విపరీతంగా నచ్చేసింది. ప్రేమ్ కుమార్ 96 సినిమా కథ చెప్పిన విధానం ఆడియన్స్ ని ఫిదా చేసింది. స్కూల్ ఏజ్ లవ్ ని దర్శకుడు చాలా అందంగా చెప్పాడు. కానీ ఇది విజయం పొందిన కథ కాదు.. విరహం నిండిన కథ. కానీ దర్శకుడు ఎంతో హృద్యంగా తెరకెక్కించాడు. 96 సినిమా మొదలవ్వడానికి ముందే దర్శకుడు ఒక నోట్ వేస్తాడు. అదేంటి అంటే మార్పులే ప్రశ్నలు.. మార్పులే సమాధానాలు అని. ఐతే మనం ఎంత మారినా ప్రేమ మాత్రం మారదు. ఐతే ఈమధ్యనే మేయలగన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన దర్శకుడు ప్రేమ్ కుమార్ తన నెక్ట్స్ సినిమా 96 సీక్వెల్ అని చెప్పాడు. 96 సినిమా కథ కొనసాగింపా ఎలా ఉంటుంది. ఏం చేస్తాడు అన్నది ఆసక్తికరంగా మారింది. స్కూల్ ఏజ్ లవ్.. హీరో హీరోయిన్ విడిపోయి చాలా ఏళ్ల తర్వాత కలుస్తారు. అప్పటికి హీరోయిన్ పెళ్లైపోతుంది. కానీ హీరో అలా ఒంటరిగా ఉంటాడు. ఐతే ఈ కథ ఇంకా ఎలా కొనసాగిస్తాడు. లేదా మరో ఇద్దరి ప్రేమ కథ 96 సీక్వెల్ గా చెబుతాడా అని ఆడియన్స్ ఎగ్జైట్ అవుతున్నారు. 96 సినిమాకు గోవింద్ వసంత్ మ్యూజిక్ ప్రాణం లాంటిది. సినిమా సక్సెస్ లో అదే ముఖ్య పాత్ర పోషించింది.

మరి ఇప్పుడు 96 సీక్వెల్ అంటున్న డైరెక్టర్ ప్రేమ్ కుమార్ ఎలాంటి కథతో వస్తారు.. ఎలా మెప్పిస్తారన్నది చూడాలి. ఐతే మిగతా కథలను కొనసాగించడం వేరు. ఒక ప్రేమ కథకు సీక్వెల్ రాయడం వేరు. మరి ఈ విషయం అనుకున్నంత ఈజీ అయితే కాదని కొందరి ప్రేక్షకుల అభిప్రాయం.

# పింక్ డ్రెస్‌లో యుక్తి అందాల షో


గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన నాగశౌర్య మూవీ 'రంగబలి' సినిమాలో హీరోయిన్‌గా నటించిన ముద్దుగుమ్మ యుక్తి తరేజా అందంతో అలరించింది. ఆ సినిమా కమర్షియల్‌గా నిరాశ పరచినా నటిగా ఆమెకు ఒక వర్గం ప్రేక్షకుల్లో గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆ సినిమా తర్వాత పెద్దగా ఆఫర్లు రాకున్నా సోషల్ మీడియాలో మాత్రం ఈమె జోరు కంటిన్యూ అవుతోంది. మిలియన్ ఫాలోవర్స్‌కి చేరువ అయిన ఈ అమ్మడు రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను, వీడియోలను షేర్ చేయడంతో పాటు, తన రెగ్యులర్ యాక్టివిటీస్‌కి సంబంధించిన ఫోటోలు వీడియోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈమె తన అందమైన ఫోటోలను షేర్ చేసి వార్తల్లో నిలిచింది. పింక్ డ్రెస్‌లో ఈ అమ్మడు చూపు తిప్పుకోనివ్వకుండా అందాలతో ఆకట్టుకుంది. క్లీ వేజ్ షో తో కవ్విస్తున్న యుక్తి తరేజా అందంపై ప్రశంసలు చేస్తున్న వారు చాలా మంది ఉన్నారు. ఇంత అందంగా ఉన్న యుక్తికి సినిమా ఇండస్ట్రీలో నిరాశ మిగలడం దారుణం అంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమెకు ఉన్న ఫాలోయింగ్ నేపథ్యంలో, ఆమె అందం నేపథ్యంలో వరుసగా ఆఫర్లు రావాల్సి ఉంది. కానీ ఆమెకు మాత్రం పెద్దగా ఆఫర్లు



రాకపోవడం చర్చనీయాంశంగా ఉంది అంటూ కొందరు అంటున్నారు. ముందు ముందు అయినా ఈమెకు మంచి ఆఫర్లు వస్తాయని అంతా నమ్మకంగా ఉన్నారు. ప్రస్తుతం ఈ అమ్మడు ఒక వెబ్ సిరీస్‌తో పాటు రెండు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమాలకు సంబంధించిన షూటింగ్ వివిధ దశల్లో ఉంది. తెలుగులో మాత్రం పెద్దగా ఈమెకు ఆఫర్లు రావడం లేదు. ఇతర భాషల్లోనే ఈమె సినిమాలు చేస్తోంది. తెలుగులో మంచి ఆఫర్స్ కోసం ఈ అమ్మడు ఎదురు చూస్తుందని తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా కచ్చితంగా ముందు ముందు ఈమెకు మంచి ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి అంటూ కొందరు సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఎక్కువ మంది సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. కనుక ఈమె సైతం ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఎక్కువగా వార్తల్లో నిలిచే అవకాశాలు ఉన్నాయి. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కనుక ముందు ముందు మంచి పాత్రలతో ఈమె ప్రేక్షకుల ముందుకు వస్తే హీరోయిన్‌గా టాప్ రేంజ్‌కి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. యుక్తి కి వెబ్ సిరీస్‌ల్లోనూ మంచి భవిష్యత్తు ఉందనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు.

# పిక్‌టాక్ : కిస్సిక్ బ్యూటీ అందాల రైడ్

రాఘవేంద్రరావు కొత్త పెళ్లి సందడి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ శ్రీలీల. ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచినా ధమాకా సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. రవితేజతో నటించిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా నిలిచింది. ఈ ఏడాదిలో మహేష్ బాబుతో కలిసి త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో గుంటూరు కారం సినిమాలో నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఫ్లాప్ అయినా శ్రీలీల జోరు మాత్రం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాదిలో పుష్ప 2 లో ఐటెం సాంగ్ చేసి దేశం మొత్తం కిస్సిక్ బ్యూటీ అనిపించుకుంది. తాజాగా ఈ అమ్మడు సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. శ్రీలీల నటిగా తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ సినిమాలు చేస్తున్న కారణంగా ఎక్కువగా ప్రయాణాలు చేస్తూ ఉంటుంది. సోషల్ మీడియాలో తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఒక వాహనంలో ప్రయాణిస్తున్న శ్రీలీల అందాల ఆరబోత చేయడంతో పాటు క్యూట్ ఎక్స్ ప్రెషన్స్‌తో అందరిని ఆకట్టుకుంటూ ఫోటోలు, వీడియోలను షేర్ చేసింది. తన అందంతో



గతంలోనే ఆకట్టుకున్న శ్రీలీల మరోసారి తన క్యూట్ ఫోటోలతో కన్నుల విందు చేసింది అంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు విజయ్ దేవరకొండతో కలిసి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఒక సినిమాను చేస్తోంది. వచ్చే ఏడాది సమ్మర్‌లో ఆ సినిమా విడుదల కాబోతుంది. సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో వరుసగా మూడు నాలుగు సినిమాలను ఈ అమ్మడు కమిట్ అయ్యింది. త్వరలోనే నవీన్ పొలిశెట్టి హీరోగా రూపొందబోతున్న సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటించబోతుంది. అంతే కాకుండా నితిన్ తో కలిసి ఒక సినిమాను చేసింది. రాబిన్‌హుడ్ అనే టైటిల్‌తో వచ్చిన ఆ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా శ్రీలీల జోరుగా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. మొదటి సినిమా ఫ్లాప్ అయినా వరుసగా సినిమా ఆఫర్లు దక్కించుకోవడం ఈ అమ్మడికే సాధ్యం అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట ఎప్పుడూ ఈ అమ్మడి పోటోలు వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఆకట్టుకునే అందాల ఆరబోత ఫోటోలు వీడియోలతో రెగ్యులర్‌గా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. శ్రీలీల వచ్చే ఏడాదిలో మూడు నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అందులో రెండు మూడు సినిమాలు హిట్ అయినా మరిన్ని సినిమాల్లో ఈ అమ్మడు నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.






# తెలంగాణ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు టీటీడీ గుడ్ న్యూస్-ఇకపై ఇలా..!

తెలంగాణలో ప్రజా ప్రతినిధులకు తిరుమల, తిరుపతి దేవస్థానం గుడ్ న్యూస్ చెప్పింది. తిరుమల దర్శనానికి వచ్చే తెలంగాణ భక్తులపై వివక్ష చూపుతున్నారనే విమర్శలు రావడంతో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో సమావేశమైన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు ఈ మేరకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇకపై తిరుమల శ్రీవారి దర్శనం విషయంలో తెలంగాణ సిఫార్సు లేఖలకు చిక్కులు తొలగినట్లే. తెలంగాణ నుంచి స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పంపే సిఫార్సు లేఖల ఆధారంగా తిరుమలలో శ్రీవారి దర్శనం కేటాయింపుల్లో ఈ మధ్య సమస్యలు తలెత్తాయి. దీంతో తెలంగాణకు చెందిన అధికార, విపక్ష పార్టీలు కూడా దీనిపై అసంతృప్తిగా ఉన్నాయి. తొలుత ఈ విషయంలో బీఆర్ఎస్ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చేసిన విమర్శలపై టీటీడీ ఛైర్మన్ తీవ్రంగా స్పందించారు. తిరుమలలో వివక్ష పేరుతో రాజకీయాలు చేస్తున్నారని కౌంటర్ ఇచ్చారు. ఆ తర్వాత మంత్రి కొండా సురేఖ కూడా ఇవే ఆరోపణలు చేయడంతో టీటీడీ వెనక్కి తగ్గింది.

ఇవాళ ఏపీ సీఎం చంద్రబాబుతో సమావేశమైన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలపై చర్చించారు. ఈ భేటీలో వీరు ప్రజా ప్రతినిధులకు శుభవార్త చెప్పారు. ఇకపై తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు ,ఎమ్మెల్సీలకు వారానికి 4 సిఫార్సు లేఖలను అంగీకరించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు అంగీకరించారు. ఇందులో వారానికి రెండు బ్రేక్ దర్శనాలతో పాటు మరో రెండు మూడు వందల రూపాయల దర్శనానికి సిఫార్సు లేఖలకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో టీటీడీ అధికారికంగా దీనిపై ఉత్తర్వులు జారీ చేయబోతోంది. అనంతరం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల్ని స్వీకరించడం ప్రారంభమవుతుంది. అలాగే ఏపీ-తెలంగాణ వివక్ష ఆరోపణలకు చెక్ పెట్టినట్లవుతుంది.

# సింపుల్ లివింగ్.. హైథింకింగ్‌కు మన్మోహన్ పర్యాయపదం: కేటీఆర్



హైదరాబాద్: ప్రధానిగా, కేంద్ర ఆర్థిక మంత్రిగా మన్మోహన్ సింగ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మన్మోహన్ గొప్పతనం, సామర్థ్యాన్ని తొలిసారి గుర్తించింది తెలంగాణ బిడ్డ పీవీ నరసింహారావు అని గుర్తుచేశారు. మన్మోహన్ మృతి నేపథ్యంలో శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. "పీవీ నరసింహారావు ప్రధాని ఆయన ఎన్నికైన తర్వాత రాజకీయాలతో సంబంధం లేని ఆర్థికవేత్త అందుబాటులో ఉన్నారని గుర్తించి మన్మోహన్‌ను ఆర్థికశాఖకు మంత్రిగా నియమించారు. పీవీ నాయకత్వం, మన్మోహన్ సిద్ధాంతాలతో దేశంలో సమూల సంస్కరణలు, విప్లవాత్మక మార్పులను వచ్చాయి. సింపుల్ లివింగ్.. హైథింకింగ్ అనే మాటకు మన్మోహన్‌సింగ్ పర్యాయపదం. అండగా నిలబడిన కాంగ్రెస్ పార్టీకి జీవితాంతం సేవలందించారు. అధికారం కోల్పోయిన తర్వాత కూడా ప్రజాస్వామిక నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష ఫలించాలని కోరుకున్నారు :** మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే కేసీఆర్ ఆయన క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. మంత్రిత్వ శాఖ విషయంలో ఓ సమస్య వచ్చింది. మన్మోహన్ కేసీఆర్‌కు షిప్పింగ్ శాఖ కేటాయిస్తే భాగస్వామ్య పక్షంగా ఉన్న డీఎంకే నేతలు అభ్యంతరం తెలిపారు. ఆ శాఖ ఇస్తామని తమకు మాటిచ్చారన్నారు. దీంతో కేసీఆర్ ఒక్కక్షణం కూడా సంకోచించకుండా ఆ పోర్ట్ ఫోలియోను వదులుకున్నారు. తాను వచ్చింది పదవుల కోసం కాదని.. తెలంగాణ కోసమని చెప్పారు. ఆ సమయంలో మన్మోహన్ కేసీఆర్‌తో మాట్లాడారు. ఏ రాష్ట్రం కోసం వచ్చారో.. అది ఫలించాలని మనసారా కోరుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల పోరాటస్ఫూర్తితో మన్మోహన్ నాయకత్వంలోనే ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు జరిగింది. దాన్ని మరిచిపోం. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా సంస్కరణల బాట నుంచి మన్మోహన్‌సింగ్ వెనక్కి తగ్గలేదు. ఎన్ని రకాలుగా ఆయన్ను అవమానించే ప్రయత్నం చేసినా ఆయన తొణకలేదు.

**పీవీకి దిల్లీలో స్మారకం నిర్మించాలి :** దిల్లీలో మన్మోహన్‌కు జరిగిన గౌరవప్రదమైన వీడ్కోలు.. పీవీ నరసింహారావుకు దక్కలేదు. మృతిచెందిన ప్రధానులకు దిల్లీలో స్మారక కట్టడాలు ఉన్నాయి. మన తెలంగాణ బిడ్డకు కేంద్రం సముచిత గౌరవం ఇవ్వాలి. పీవీకి దేశ రాజధానిలో స్మారక కట్టడం నిర్మించాలని సభలో ఏకగ్రీవ తీర్మానం చేయాలి" అని కేటీఆర్ అన్నారు.

# రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్: మన్మోహన్ సింగ్ హయాంలోనే విప్లవాత్మక భూసేకరణ చట్టం వచ్చిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. "దేశ క్షేమం దృష్ట్యా మన్మోహన్ సింగ్ న్యూక్లియర్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన మృతి దేశానికి తీరని లోటు. రైతులకు రుణమాఫీ చేసిన తొలి ప్రధాని మన్మోహన్ సింగ్. సోనియా గాంధీ సూచనల మేరకు ఆయన గొప్ప చట్టాలు తెచ్చారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నవారు జవాబుదారీగా ఉండాలని సమాచార హక్కు చట్టం తీసుకొచ్చారు. ప్రజల సొమ్ముతో చేసిన పనుల వివరాలు తెలుసుకొనే హక్కు దీని ద్వారా లభించింది. ఆకలి చావులు ఉండకూడదని ఆహార భద్రత చట్టం తెచ్చారు" అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

**దేశాభివృద్ధికి అనేక గొప్ప విధానాలు తెచ్చారు: మంత్రి శ్రీధర్‌బాబు...** దేశాభివృద్ధికి మన్మోహన్ సింగ్ అనేక గొప్ప విధానాలు తీసుకొచ్చారని మంత్రి శ్రీధర్‌బాబుగుర్తుచేసుకున్నారు. ఆయన సాధారణ స్థాయి నుంచి ఉన్నతస్థాయికి ఎదిగారని కొనియాడారు. మన్మోహన్‌ను ఆర్థికమంత్రిగా అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ఎంపిక చేశారని గుర్తు చేశారు.

గ్రామీణ పేదలకు పని కల్పించే ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ తెచ్చారని పేర్కొన్నారు. స్టాక్ మార్కెట్ పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. సామాన్య ప్రజలకు ఆయుధమైన 'ఆర్టీఐ', ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉండాలనే ఉద్దేశంతో 'ఆధార్' తెచ్చారన్నారు. మన్మోహన్ సింగ్ హయాంలో రాష్ట్రాల్లో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారని వివరించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన క్రియాశీల పాత్ర పోషించారని శ్రీధర్‌బాబు చెప్పారు.

# స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మొద్దు: సజ్జనార్



హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌లు ఎంతో మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయని టీజీఆర్టీసీ ఎండీ, ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ అన్నారు. కాసులకు కక్కుర్తిపడి వాటికి ప్రచారం చేయొద్దని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఆయన సూచించారు. ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. "రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావొచ్చని.. ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో విడుదల చేసే వీడియోల వల్ల అమాయకులు ఆన్‌లైన్ బెట్టింగ్ మహమ్మారికి బానిసలవుతున్నారు. బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్వలాభం కోసం ప్రజాశ్రేయస్సును విస్మరించడం ఎంత వరకు సమంజసం? సమాజ క్షేమం పట్టని మీ పెడధోరణులు క్షమించరానివి.

కష్టపడకుండానే కాసులు పోగేసుకోవాలన్న ఆలోచన అనర్థమని యువత గుర్తించాలి. స్వార్థ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల మాటలు నమ్మి ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో పడకండి. ఇలాంటి సంఘ విద్రోహ శక్తులకు దూరంగా ఉండండి" అని సజ్జనార్ పేర్కొన్నారు.

# పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్

కరీంనగర్: ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అరెస్ట్‌పై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై పరోక్షంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు గొప్పో పవన్ కల్యాణ్‌కే తెలియాలని అన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేసినట్లుగా పవన్ కల్యాణ్ భావిస్తున్నారా అని ప్రశ్నించారు. పుష్ -2 మూవీ కలెక్షన్లలో రేవంత్‌కు 14 శాతం వాటా ముట్టిందేమోననే అనుమానం తనకు ఉందని సంచలన ఆరోపణలు చేశారు. ఇవాళ(సోమవారం) కరీంనగర్‌లో బండి సంజయ్ పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... తెలంగాణ అసెంబ్లీ ఎందుకు పెట్టారంటే.. అల్లు అర్జున్ కోసం అన్నట్లుగా ఉందని విమర్శించారు. అల్లు అర్జున్‌కు రేవంత్‌కు ఎక్కడో చెడిందని ఆరోపించారు. ఒక వ్యక్తి గురించి ఇంతగా అసెంబ్లీలో మాట్లాడాల్సిన అవసరం ఏంటని బండి సంజయ్ నిలదీశారు. కాంగ్రెస్‌లో అంతర్యుద్ధం జరుగుతోందని బండి సంజయ్ విమర్శించారు. కమీషన్ల విషయంలో మంత్రుల మధ్య సఖ్యత లేదని అన్నారు. కాంగ్రెస్‌లో ఏమైనా జరగొచ్చు.. వాళ్లలో వాళ్లు ఏమైనా చేసుకోవచ్చని షాకింగ్ కామెంట్స్ చేశారు. 14 శాతం కమీషన్ మీదే ప్రభుత్వం బతుకుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ముగ్గురు మంత్రుల బండారం బయట పెడతానని హెచ్చరించారు. బ్రోకర్లను పెట్టుకుని బిల్లులు మంజూరు చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మంత్రులందరికీ సీఎం కావాలని ఉందని అన్నారు. ఢిల్లీకి డబ్బులు పంపడం వల్లే.. సీఎం పదవి నిలబడుతోందని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే మంత్రుల కుర్చీలు కూడా ఉండవని బండి సంజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు.




# ఇది కక్ష్యా.. శిక్ష్యా.. నిర్లక్ష్యమా..: కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ ప్రభుత్వంపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "ఇది కక్ష్యా.. ఇది శిక్ష్యా,, ఇది నిర్లక్ష్యమా'.. పదేళ్లలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాల గౌరవం.. ఏడాదిలో ఎందుకు పడిపోయిందని ప్రశ్నించారు. గురుకులాలను ఉద్దేశపూర్వకంగా పక్కనపెట్టే ప్రయత్నం చేస్తున్నారా.. మండలానికి ఒక్క గురుకుల పాఠశాలకు మాత్రమే పరిమితం చేసే కుట్ర దాగి ఉందా.. అందుకే ఉద్దేశపూర్వకంగా విద్యార్థుల్లో, విద్యార్థుల తల్లిదండ్రులలో అభద్రతా భావం పెంచుతున్నారా.. ఏడాదిలో 50 మందికి పైగా విద్యార్థులు మరణించినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.. ప్రతిష్ఠాత్మకంగా సీఎం నుండి మంత్రుల వరకు కామన్ డైట్ అంటూ అట్టహాసంగా ప్రారంభించింది ఆరంభ శూరత్వమేనా".. అని ప్రశ్నించారు. కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందని, నేడు అంతులేని నిర్లక్ష్యం కనిపిస్తోందని కేటీఆర్ అన్నారు. విద్యార్థులు గురుకులాల నుండి పారిపోయే పరిస్థితికి కారణం ఎవరని ప్రశ్నించారు. కాగా కేటీఆర్ నాయకత్వంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లనున్నారు. మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానంపై సభలో బీఆర్ఎస్ తరుపున కేటీఆర్ మాట్లాడనున్నారు. కాగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌లో న్యాయం ఉందని, ఆ ఆశయం ఫలించాలని మనస్ఫూర్తిగా ఆశించిన వ్యక్తి మన్మోహన్ సింగ్ అని కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు మన్మోహన్‌తో ఎంతో సాన్నిహిత్యం ఉందని.. తెలంగాణ ఉద్యమ సమయంలో అధైర్య పడొద్దని, వెన్నుతట్టి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. శుక్రవారం రాత్రి ఢిల్లీలో మాజీ ప్రధాని మన్మోహన్ పార్థివదేహానికి బీఆర్ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్ రెడ్డి, దామోదర్‌రావులతో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశాన్ని మన్మోహన్ ఆర్థికంగా ఎంతో ముందుకు తీసుకెళ్లారని, ప్రపంచంలో దేశ ఖ్యాతిని పెంచారని తెలిపారు. దాదాపు రెండేళ్లపాటు ఆయన కేంద్ర మంత్రివర్గంలో కేసీఆర్ పనిచేశారని గుర్తు చేశారు. 2004లో కేంద్ర మంత్రివర్గంలో చేరిన తర్వాత తెలంగాణ ఉద్యమంలో ఎన్నోసార్లు ఆటుపోట్లు ఎదురైతే అధైర్య పడొద్దని ప్రోత్సహించారని చెప్పారు. కాగా దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలపడానికి సోమవారం శాసనసభ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రధానిగా మన్మోహన్ సింగ్ చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతగా అసెంబ్లీలో నివాళులర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 10 గంటలకు సభ సమావేశం ప్రారంభం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టి ప్రసంగించనున్నారు. ఈ ప్రత్యేక సమావేశాల ఏర్పాట్లను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం పరిశీలించారు.



# ఇంట్లో వంట గదికి కిటికీలు వద్దు..

అఫ్గానిస్థాన్‌ను చేజిక్కించుకున్న తాలిబన్లు... అక్కడి మహిళల హక్కులను కాలరాస్తున్నారు. తాజాగా ఆ దేశ పాలకులు తీసుకువచ్చిన డిక్రీ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. నూతనంగా నిర్మించే ఇళ్లల్లో మహిళలు బయటివారికి కనిపించేలా వంట గదికి కిటికీలు ఏర్పాటుచేయొద్దని ఆదేశాలు ఇవ్వడం నివ్వెరపరుస్తోంది. "వంట గదులు, ఇంటి ఆవరణ, నీటికోసం బావుల వద్దకు వచ్చిన మహిళలు బయటివారికి కనిపిస్తే అభ్యంతరకర చర్యలకు దారితీసే వీలుంది. వారు కనిపించకుండా గోడలు కట్టాలి. ఇప్పటికే స్త్రీలు బయటకు కనిపించేలా నిర్మాణాలు ఉంటే వాటిని మూసివేయాలి" అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈనేపథ్యంలో మున్సిపల్ అధికారులు కొత్త నిర్మాణాలను పరిశీలించి, ఈ ఆదేశాల అమలును పర్యవేక్షించనున్నారు. మతపరమైన ఆచారాల ముసుగులో మహిళల హక్కులు, స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపుతున్న తాలిబన్ ప్రభుత్వం.. ఇప్పటికే జిమ్‌లు, పార్కుల్లోకి మహిళల ప్రవేశంపై నిషేధం అమలుచేస్తోంది. మిడిల్ స్కూల్, హైస్కూల్ విద్యకు బాలికల్ని దూరం చేయడం.. పలు రంగాల్లో మహిళల ఉద్యోగాలను పరిమితం చేయడం, ఆటలాడటంపై నిషేధం, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు తల నుంచి కాలి వరకు దుస్తులు ధరించాలని ఆదేశించడం వంటి అనేక కఠిన ఆంక్షలు విధించారు.

తాలిబన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను గతంలో ఐరాస ఖండించింది. జనజీవన స్రవంతి నుంచి మహిళల్ని క్రమపద్ధతిలో దూరం చేసే ఇలాంటి చర్యలు సరికాదని ఆందోళన వ్యక్తంచేసింది.



# అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్.. అందుకే స్పేడెక్స్ ఆలస్యం

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాది చేపట్టిన చివరి ప్రయోగం వాయిదా పడిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన ఇస్రో ఛైర్మన్ ఎస్. సోమ్‌నాథ్.. స్పేడెక్స్ ప్రయోగం ఆలస్యానికి గల కారణాన్ని వివరించారు. అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ వల్లే అనుకున్న సమయానికి జరగాల్సిన ప్రయోగానికి అంతరాయం కలిగినట్లు తెలిపారు. "అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాకెట్ వెళ్లాల్సిన అదే కక్ష్యలో ఇతర ఉపగ్రహాలు అనుసంధానం చెందడం వల్ల ఈ పరిస్థితికి దారితీసింది. దీంతో ప్రయోగం రెండు నిమిషాలు ఆలస్యం అయింది. 9.58 గంటలకు బదులుగా 10 గంటల 15 సెకన్లకు రీషెడ్యూల్ చేశాం" అని ఓ ప్రముఖ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సోమ్‌నాథ్ వెల్లడించారు. అయితే.. కక్ష్యలో ఇలా జరిగి ప్రయోగం ఆలస్యం కావడం ఇదే తొలిసారి కాదు. 2023లో చంద్రయాన్-3 మిషన్‌ను కూడా కొన్ని నిమిషాల పాటు వాయిదా వేయాల్సి వచ్చింది. స్టార్‌లింక్‌కు చెందిన కొన్ని ఉపగ్రహాలు ఈ దారిలో వస్తున్నట్లు ఇస్రోలోని నిపుణులు గుర్తించారు. ప్రస్తుతం స్టార్‌లింక్ సముదాయానికి చెందిన 7 వేల ఉపగ్రహాలు భూమి కక్ష్యలో దిగువ భాగంలో ఉన్నాయని తెలిపారు. చాలాకాలంగా ఈ భారీ నక్షత్రరాశులు అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయని వివిధ అంతరిక్ష సంస్థల శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అంతేకాకుండా.. అంతరిక్ష వ్యర్థాల కారణంగా ఉపగ్రహాలకు భారీ ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కాగా.. సతీశ్‌ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ సీ-60 నింగిలోకి దూసుకెళ్లనుంది. స్పేడెక్స్ ప్రయోగం ద్వారా ఛేజర్, టార్గెట్ ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ సీ-60 ప్రవేశపెట్టనుంది. ఈ రెండు ఉపగ్రహాల బరువు 440 కిలోలు. ప్రయోగానికి కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైన అనంతరం అంతరిక్షంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రయోగాన్ని రెండు నిమిషాలు ఆలస్యంగా రీషెడ్యూల్ చేశారు.

# సరస్వతి బ్యారేజీలో భూ భౌతిక పరీక్షలు

మహదేవపూర్ : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సరస్వతి బ్యారేజీలో భూ భౌతిక పరీక్షలు(జియో ఫిజికల్ టెస్టులు) ప్రారంభమయ్యాయి. బ్యారేజీలో లీకులు సంభవించిన నేపథ్యంలో భూమి స్వభావాన్ని తెలుసుకొనేందుకు మూడు నెలల క్రితం ఒకటి, రెండో విడత భూ భౌతిక పరీక్షలు జరిగాయి. భారీ వర్షాల కారణంగా మూడో విడత పరీక్షలను నిర్వహించలేకపోయారు. ఈ క్రమంలో ఆదివారం వాటిని చేపట్టారు. నలుగురు శాస్త్రవేత్తలు సరస్వతి బ్యారేజీ వద్దకు చేరుకొని మూడో విడత భూ భౌతిక పరీక్షలు ప్రారంభించారు. మూడు రోజులపాటు ఇవి జరగనున్నట్టు శాస్త్రవేత్తలు ధనంజయ్ నాయుడు, వివేక్, ప్రశాంత్ సింగ్ సవాంగ్ తెలిపారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com